

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శనివారం 17, అక్టోబర్ 2026 16 పేజీలు

సేఫ్టీ బెల్ట్ ఎక్కడ?



భారీ గ్రానైట్ రాళ్ల రవాణాతో బెంబేలెత్తుతున్న వాహనదారులు!

రక్షణ చర్యలు లేకుండానే రయ్.. రయ్.. అంటూ లారీల పరుగులు

స్పీడ్ బ్రేకర్ల వద్దా తగ్గని వేగం.. ప్రమాదం పొంచి ఉందని ఆందోళన

పట్టించుకోని అధికారులు.. చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

2లో



నిరుపేదల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం..

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

అధికారులు ప్రతిరోజు పనులు పరిశీలించాలి

అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

2లో

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: నిరుపేదల సంతో షమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.



కోతలపై కొనసాగుతున్న ఆందోళనలు

ఎండుతున్న వరి పంటలు .. రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్న రైతులు

విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలంటున్న ప్రభుత్వం

విద్యుత్తు కోతలను ఎత్తివేయాలంటున్న ప్రతిపక్ష పార్టీలు

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త: అన్నదాత పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్తు కోతలు ప్రారంభమ య్యాయి. దీంతో రైతులు ఆందోళ నలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కోతలపై రైతులు సబ్ స్టేషన్ ల ముందు ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 24 గంటలు విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రోజు ఐదు గంటలు కూడా వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం లేదని ఆరోపించారు. గంటసేపు ఆందోళన చేపట్టి అధికారుల హామీ మేరకు విరమించారు.



2లో

రిజిస్ట్రేషన్లలో ఫీజు టూ ఫీజు దందా!

నిబంధనలకు నీళ్లొదులుతున్నారన్న ఆరోపణలు

డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లో వ్యవహారాలు

స్లాట్ లేకున్నా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న విమర్శలు

ఉన్నతాధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

గోదావరిఖని, ప్రభాతవార్త: ఆస్తుల క్రయవిక్రయాలు.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన వ్యవహారాల్లో అక్రమాలకు ఆస్కారం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రామగుండం కార్యాల యానికి నేరుగా వెళ్లి పని చేయించుకోవడం కష్టమవుతోందని, మధ్యవర్తులను ఆశ్రయిస్తేనే పనులు వేగంగా పూర్తవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆస్తుల విలువ, డాక్యుమెంట్ల స్వభావాన్ని బట్టి అదనపు వసూళ్లు జరుగుతు న్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకత ఎక్క? ప్రభుత్వ రుసుములకు అదనంగా వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలపై పర్యవేక్షణ ఏది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

నిరుపేదల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇల్లు త్వరగా పూర్తి చేయాలి

అధికారులు ప్రతిరోజు పనులు పరిశీలించాలి

అర్బన్ హౌసింగ్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: నిరుపేదల సంతోషమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజల్లో ఇప్పటివరకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకొని పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా కాలనీలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల వారికి ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేసే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిందూ సోదరులకు దేవాలయం, ముస్లింలకు మసీదు, క్రైస్తవులకు చర్చి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారానికి మొబైల్ టవర్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కాలనీలో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్, రవాణా,



కమ్యూనికేషన్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా దశలవారీగా కల్పిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు రూ.2.77 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం బస్సు సర్వీసును ప్రారంభించడం ద్వారా కాలనీ వాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం కింద అర్హత ఉన్నప్పటికీ ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని కుటుంబాలు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ వంటి సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటూ, కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ అధికారులు,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.్నరు.

రిజిస్ట్రేషన్లలో ఫీజు టూ ఫీజు దందా!

నిబంధనలకు నీళ్లొదులుతున్నారన్న ఆరోపణలు

డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లో వ్యవహారాలు

స్లాట్ లేకున్నా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న విమర్శలు

ఉన్నతాధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

గోదావరిఖని, ప్రభాతవార్త: ఆస్తుల క్రయవిక్రయాలు.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన వ్యవహారాల్లో అక్రమాలకు ఆస్కారం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రామగుండం కార్యాలయానికి నేరుగా వెళ్లి పని చేయించుకోవడం కష్టమవుతోందని, మధ్యవర్తులను ఆశ్రయిస్తేనే పనులు వేగంగా పూర్తవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆస్తుల విలువ, డాక్యుమెంట్ల స్వభావాన్ని బట్టి అదనపు వసూళ్లు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకత ఎక్క? ప్రభుత్వ రుసుములకు అదనంగా వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలపై పర్యవేక్షణ ఏది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

డాక్యుమెంట్ రైటర్లదే కీలకపాత్ర?

పెద్దపల్లి జిల్లా పరిధిలోని రామగుండం రిజిస్ట్రేషన్ కార్యాలయం లో డాక్యుమెంట్ రైటర్ల పాత్రపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైటర్లు అధికారులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ క్రయవిక్రయదారులకు, కార్యాలయ సిబ్బందికి మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. డాక్యుమెంట్ విలువ, లావాదేవీ స్వభావాన్ని బట్టి అదనపు మొత్తాల కోసం బేరసారాలు సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.ఫీజు టూ ఫీజు పేరుతో ప్రతి డాక్యుమెంట్‌కు అదనపు వసూళ్లు జరుగుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.2,3 వేల చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలతో పాటు, సమస్యాత్మక లావాదేవీలకు మరింత మొత్తం డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వసూళ్ల వివరాలు, లావాదేవీల రికార్డులు, అధికారుల పాత్రపై స్వతంత్ర నిర్ధారణ అవసరం. ఆరోపణలు నిజమైతే వాటి వెనుక ఉన్న వ్యక్తులెవరు? వసూళ్లకు బాధ్యులెవరు? అన్నది తేలాల్సి ఉంది.

స్లాట్ నిబంధనలకు మినహాయింపులా?

రిజిస్ట్రేషన్ల కోసం ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని, కేటాయించిన తేదీ, సమయంలో ప్రక్రియ పూర్తి చేసుకోవడం సాధారణ విధానం. అయితే కొన్ని కార్యాలయాల్లో స్లాట్ లేకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారీ స్లాట్ పరిమితికి మించి లావాదేవీలు ఎలా జరుగుతున్నాయి? నిబంధనల ప్రకారం అనుమతించిన సందర్భాలేవి? వాటికి సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.స్లాట్ లేకుండా వచ్చే వారి పనులు మధ్యవర్తుల ద్వారా వేగంగా పూర్తవుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్న ప్రచారంపై ఉన్నతాధికారులు రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే ప్రతి స్లాట్ కాని లావాదేవీని అక్రమంగా పరిగణించకుండా, అమల్లో ఉన్న నిబంధనలు, అనుమతులు, సంబంధిత రికార్డుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలి.

పర్యవేక్షణ ఎక్కడ?

రిజిస్ట్రేషన్ల శాఖలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నా, వాటిపై సమగ్ర తనిఖీలు, పారదర్శక విచారణలు జరుగుతున్నాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా, రోజువారీ రిజిస్ట్రేషన్ల సంఖ్య, స్లాట్ వివరాలు, ప్రభుత్వ రుసుములు, అదనపు చెల్లింపుల ఆరోపణలను సమన్వయంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయన్న ప్రస్తావనల నేపథ్యంలో, సంబంధిత కేసుల వివరాలు, శాఖాపరమైన విచారణల స్థితి, బాధ్యులపై తీసుకున్న చర్యలను ఉన్నతాధికారులు వెల్లడిం చాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై విచారణ పూర్తికాకముందే వారు కీలక స్థానాల్లో కొనసాగుతున్నారా? బదిలీలు, పునర్నియామకాల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా? అన్న అంశాలపైనా స్పష్టత అవసరం.రామగుండం పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ అంశాలపై తనిఖీలు నిర్వహించి, ఫిర్యాదుల వాస్తవికతను పరిశీలించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వ రుసుముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, మధ్యవర్తుల ప్రమేయంపై ఫిర్యాదులను స్వీకరించడం, స్లాట్ వివరాలను తనిఖీ చేయడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం, నిరాధారమైన ఆరోపణలుంటే వాస్తవాలను వెల్లడించడం ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.



కోతలపై కొనసాగుతున్న ఆందోళనలు

ఎండుతున్న వరి పంటలు

రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్న రైతులు

విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలంటున్న ప్రభుత్వం

విద్యుత్తు కోతలను ఎత్తివేయాలంటున్న ప్రతిపక్ష పార్టీలు

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాత వార్త: అన్నదాత పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్తు కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కోతలపై రైతులు సబ్ స్టేషన్ ల ముందు ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 24 గంటలు విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రోజు ఐదు గంటలు కూడా వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం లేదని ఆరోపించారు. గంటసేపు ఆందోళన చేపట్టి అధికారుల హామీ మేరకు విరమించారు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్ఫార్మర్‌లు కాలిపోవడంతో కొద్దిరోజులుగా నీరు అందక మంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ కొత్త ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల్లో రైతుల నిరసన చేశారు. అధికారుల హామీ మేరకు విరమించారు. అదేవిధంగా పలు విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేశారు. సబ్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు. విద్యుత్తు సంక్షోభం ఏర్పడింది. ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ నీటిమట్టం అడుగంటి వరి పంటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్తు సక్రమంగా సరఫరా కాకపోవడంతో మరింత పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పంటలు చేతికొచ్చే సమయంలో కాపాడుకోకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. పలు మండలాల్లో రైతులు ఆందోళనలు చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ముందుగానే ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. కానీ రైతులు పరిస్థితులు అనుకూలించకపోతాయా అనే ఉద్దేశంతో పంటలు సాగు చేశారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడం భూగర్భ నీటిమట్టం అడుగంటటము రైతులకు తీరని శాపంగా పరిణమించింది. దీంతో ఏమి పాలు పోని పరిస్థితుల్లో అన్నదాత ఉండిపోయారు. ఎక్కువ శాతం మంది రైతులు బోర్లు బావుల నిర్మాణం చేపట్టి కొత్త విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో విద్యుత్ వినియోగం వ్యవసాయ రంగంలో అధికమైంది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయము ఏర్పడటంతో పాటు విద్యుత్ ఉత్పత్తి తగ్గి పూర్తిస్థాయిలో విద్యుత్ను అందజేయలేకపోతున్నారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించినప్పటికీ ప్రయోజనం లేదు. పలు గ్రామాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. భూగర్భ నీటిమట్టం అడుగంటడంతో విద్యుత్ మోటార్లు సైతం కాలిపోతున్నాయి. దీంతో రైతులకు భారంగా పరిణమించింది. పెట్టుబడి తీవ్రంగా పెరుగుతుంది. అన్నదాత పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ముందు ముందు విద్యుత్ సమస్య తీవ్ర రూపం దాల్చనున్నందున రైతుల కష్టాలు తప్పే పరిస్థితి కనిపించడం లేదు. విద్యుత్ సమస్యపై ప్రతిపక్ష పార్టీలు కూడా రైతులకు మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. రైతులతో పాటు ఆందోళనలో పాల్గొని విద్యుత్ సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో విఫలమైందని ప్రతిపక్ష పార్టీల నాయకులు దుమ్మెత్తి పోస్తున్నాయి. దీంతో అధికార పక్షం కూడా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. ఆందోళనలు మరింత ఉధృతం చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి.



జీలకుంటలో రూ. 25 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

కాంగ్రెస్ హయాంలో గ్రామాలకు మహర్దశ – ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ఓదెల,ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. ఓదెల మండలం జీలకుంట గ్రామంలో నాలుగు లక్షలతో చెరువు కట్ట నుండి స్మశాన వాటికకు విద్యుత్తు 22 స్తంభాలతో విద్యుత్ వెలుగులు లను అలాగే రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఓదెల గ్రామస్తులైన వంగ రాయమల్లు గతంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో మరణించడంతో విద్యుత్ శాఖ తరపున బీమా 5 లక్షల బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులైన భార్య రాజకుమారి కుమారుడు అనిల్ కు అందజేశారు ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, తారు రోడ్డు, వీధి దీపాలను ప్రారంభించారు. అనంతరం విజయరమణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఓదెల మండలంలో అన్ని గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడి తౌటం రవీందర్, ఎంపీడీవో అనిల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రాగిడిమంగ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్,సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు నాయకులు బొంగుని శ్రీనివాస్ గౌడ్, అంబాల కొమురయ్య, పుప్పాల శంకర్, రంగు మల్లేశం గౌడ్, గుగులోతు నిమ్మ,సిట్ల రాములు, కట్కూరి సమ్మిరెడ్డి, చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై విచారణ జరపాలి

గంభీరావుపేట ఎస్ఐ, సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలి

దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది కనకం వంశీ కిరణ్ డిమాండ్



మల్యాల, ప్రభాతవార్త : పత్రికలో వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది కనకం వంశీ కిరణ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ శేఖర్‌లను శుక్రవారం పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకం వంశీ కిరణ్ మాట్లాడుతూ.. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం, పోలీసుల అదుపులో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ ఘటనపై సిరిసిల్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. స్వతంత్ర విచారణకు డిమాండ్... పోలీసుల అదుపులో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా అందిందని బాధితులు పేర్కొన్నారన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎక్కడెక్కడ దాడులు జరిగాయి? ఎవరు బాధ్యులు? ఎవరి ఆదేశాలతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే అంశాలపై స్వతంత్రంగా విచారణ జరపాలని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది కనకం వంశీ కిరణ్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలకు తావుండకూడదని, గంభీరావుపేట ఎస్ఐతో పాటు బాధ్యులైన పోలీసులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల జర్నలిస్టులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొనుకటి సంతోష్,ఎలగందుల ఉప సర్పంచ్ గసికంటి కుమార్ తదితరులు ఉన్నారు.

కప్పరావుపేట మసీదు సమీపంలో

ఘోర రోడ్డు ప్రమాదం

కారు-బైక్ ఢీకొని ఒకరి మృతి..

మరొకరికి తీవ్ర గాయాలు



వెల్గటూరు, ప్రభాత వార్త: జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని వెల్గటూరు మండలం కప్పరావుపేట మసీదు సమీపంలో రాష్ట్ర రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న స్నేహితులు శతరాజుల కొమురయ్య (40), ముల్కల శ్రీనివాస్ తీవ్రంగా ప్రమాదానికి గురయ్యారు. కారు ఢీకొన్న ఘటనలో శతరాజుల కొమురయ్య సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ముల్కల శ్రీనివాస్‌ను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.మృతుడు కొమురయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనతో కప్పరావుపేట పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేరాలు-దారుణాలు



గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

28 గ్రాముల గంజాయి స్వాధీనం

ఓదెల,ప్రభాతవార్త: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పొత్కపల్లి ఎస్ఐ సనత్ రెడ్డి తన పోలీసులు సిబ్బందితో కలిసి తనిఖీలు చేసుస్తున్న తరుణంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 28 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం అక్టోబర్ 15న పొత్కపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి పారిపోతున్న జక్కుల వినాయక్ (21), రేవెల్లి వంశీ (24)లను పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి లభించింది. వీరిద్దరూ పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లికి చెందినవారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల మండలాల్లోని విద్యార్థులు, యువతకు విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.700 ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సనత్ రెడ్డి హెచ్చరించారు. మాదకద్రవ్యాల అక్రమ విక్రయాల సమాచారం తెలిస్తే డయల్ 100కు తెలియజేయాలని కోరారు. వారిని గోప్యంగా ఉంచుతామని అన్నారు.



సబ్ స్టేషన్ ను సందర్శించిన ఎస్.ఈ

జూలపల్లి,ప్రభాతవార్త: సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఈ.) జూలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి, రాబోయే రబీ పంట సీజన్, వేసవికాలంలో పెరిగే విద్యుత్ లోడ్లను దృష్టిలో ఉంచుకొని,నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.విద్యుత్ పరికరాల నిర్వహణ,లోడ్ పర్యవేక్షణ,సబ్‌స్టేషన్ పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాలయ్య డి.ఈ.టి, రాజబ్రహ్మాచారి డి ఈ ఆపరేషన్, హరీష్ ఏ ఈ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు రైజింగ్ సన్ స్కూల్ విద్యార్థి

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన విద్యార్థి అర్సలాన్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి అర్హత సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి వెల్లడించారు. సెప్టెంబర్ 29న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో అర్సలాన్ తన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అతడు పాల్గొనను న్నాడు. విద్యార్థి సాధించిన విజయంపై పాఠశాల కర స్పాండెంట్ సయీద్ అహ్మ ద్, ప్రధా నోపాధ్యా యుడు హకీమ్ ఖాన్ హర్షం వ్యక్తం చేస్తూ అభినం దించారు. రాష్ట్రస్థాయి లోనూ ప్రతిభ చాటి పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్స హించారు.



వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలి

కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు

సింగరేణి అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మేడిపల్లి, ప్రభాతవార్త: వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉమ్మడి మేడిపల్లి మండల కేంద్రంలో భీమారం, మేడిపల్లి మండలాల బీఆర్ఎస్ సర్పంచులు, నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా, బొగ్గు నిల్వలు, సింగరేణి నిర్వహణ అంశాలపై ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. వ్యవసాయానికి నీరు అందాలంటే విద్యుత్ కీలకమని, సరైన సమయంలో కరెంటు అందకపోతే పంటలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపకుండా, ముందస్తు ప్రణాళికతో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని, బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్ల డించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. సింగరేణి టెండర్లు, సైట్ విజిట్ సర్టిఫికెట్ల అంశాలపైనా స్పష్టత ఇవ్వాలని, సంస్థ వాటాల విక్రయం, ప్రైవేటీకరణపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి సహాయం అందించాలని, కాలిపోయిన మోటార్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని నాయకులు కోరారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించేందుకు గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు గాగోజీ చారి, మకిలి దాస్, గంగారెడ్డి, సుప్రియ హరీష్ రెడ్డి, కావేరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంటలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి

తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి డిమాండ్



కోరుట్ల, ప్రభాతవార్త : వ్యవసాయ పంటలు చేతికి వచ్చే ప్రస్తుత కీలక సమయంలో విద్యుత్ కోతలు, తీవ్రమైన లో వోల్టేజీ సమస్యల వల్ల పంటలు కళ్ళముందే ఎండిపోతుండడం అత్యంత విచారకరమనీ, చివరి దశలో ఉన్న వ్యవసాయ పంటలను ఆదుకునేందుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయ రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్లలో శుక్రవారం నాడు తెలంగాణ రైతు ఐక్యవేదిక నాయకులు మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజారెడ్డిలతో కలిసి శేర్ నర్సా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలు, తీవ్రమైన లోవోల్టేజీ సమస్యల వల్ల వ్యవసాయ పంటలు కళ్ళముందే ఎండిపోతుండడం అత్యంత విచారకరమన్నారు. పంటలు పక్వానికి వచ్చే చివరి తరుణంలో నీరు అందక ఎండిపోతున్నాయనీ, దీనివల్ల రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందనీ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రమైన లో వోల్టేజీ కారణంగా పొలాల్లోని కరెంటు మోటర్లు కాలిపోతున్నాయనీ, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మోటర్ల మరమ్మత్తు ఖర్చులు అదనపు భారంగా మారాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఏ సమయంలో కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయ పంటలు చివరి దశలో ఉన్నందున పంటలు చేతికి వచ్చే వరకు ఎలాంటి అప్రకటిత విద్యుత్ కోతలు విధించవద్దనీ, మోటర్లు కాలిపోకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని శేర్ నర్సా రెడ్డి కోరారు. లో వోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలలో వెంటనే అదనపు ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరెంటు అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి చివరి దశలో ఉన్న వ్యవసాయ పంటలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని లేకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి



కోరుట్ల, ప్రభాతవార్త: దసరా పండుగను పురస్కరించుకుని కోరుట్ల పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము తిరుపతి గారు మాట్లా డుతూ, పండుగల వేళ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. సమాజంలో నేర ప్రవర్తనను వీడి సాధారణ పౌరులుగా జీవించాలని సూచించారు.దసరా పండుగ సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలందరూ పండుగను ప్రశాంతంగా, ఉత్సాహంగా జరుపుకునేందుకు సహకరించాలని, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో అమిత్యాకు కాంస్య పతకం

మాస్టర్ తైక్వాండో క్లబ్ విద్యార్థిని ప్రతిభకు ప్రశంసలు



కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి తైక్వాండో సెలక్షన్స్ కమ్ ఛాంపియన్‌షిప్‌లో కోరుట్లకు చెందిన మాస్టర్ తైక్వాండో క్లబ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థిని పోగుల అమిత్యా కాంస్య పతకం సాధించింది. అండర్17 బాలికల విభాగంలో అండర్52 కిలోల వెయిట్ కేటగిరీ ఫైటింగ్ విభాగంలో పోటీపడిన అమిత్యా తన అద్భుతమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శించి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకోగా, వికారాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ఎండీ కాజా చేతుల మీదుగా ఆమె పతకాన్ని అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించి తిరిగి వచ్చిన అమిత్యాను జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ జి. సంతోష్ కుమార్, కరీంనగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్. సంతోష్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు కోల గంగారావు మాస్టర్లు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్ తైక్వాండో క్లబ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, తైక్వాండో కోచ్, నేషనల్ రిఫరీ నావనంది రమేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అమిత్యా కాంస్య పతకం సాధించడం అకాడమీకి, కోరుట్ల పట్టణానికి గర్వకారణమని తెలిపారు.



మన్నెగూడెం పదో వార్డులో చీకట్లు.. పట్టించుకునేవారేరీ!

పది రోజులుగా వెలగని వీధి దీపాలు..

ప్రమాదకరంగా మారిన సింగిల్ ఫేజ్ డీటీఆర్



భీమారం, ప్రభాతవార్త: భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని పదో వార్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డులోని ఐదారు విద్యుత్ స్తంభాలపై బల్బులు పనిచేయడం లేదని వార్డు సభ్యుడు తేలు నందం సంబంధిత గ్రామస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, పది రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న వేళ, దసరా పండుగ సమీపిస్తున్నా వీధి దీపాల మరమ్మతులపై స్పందన లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో చీకటి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బల్బులు ఏర్పాటు చేసి వీధులకు వెలుగులు కల్పించాలని కోరారు. ఇదే వార్డులోని సింగిల్ ఫేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారిందని, ఈ సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. పండుగల వేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వీధి దీపాలను పునరుద్ధరించడంతో పాటు, సింగిల్ ఫేజ్ డిటిఆర్ పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని వార్డు సభ్యుడు కోరుతున్నారు.

నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

కోరుట్ల, ప్రభాతవార్త :



తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గడ్డం మధు, కార్యదర్శిగా నియామకమైన గుడ్ల మనోహర్ లను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. పద్మశాలి లకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజేవైఎం నాయకులు, కార్యకర్తలు, పద్మశాలి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సేవలు

అభినందనీయం

వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే రెండు విభాగాల్లో పురస్కారాలు

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాయకల్ప అవార్డులు సాధించిన సూపరింటెండెంట్ డాక్టర్ కొండ శ్రీధర్, ఆరఎంఒ విజయ్ కుమార్‌లకు ఘన సన్మానం

పెద్దపల్లి, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, పరిశుభ్రత నిర్వహణలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కాయకల్ప అవార్డుల్లో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రెండు విభాగాల్లో పురస్కారాలు సాధించిన సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండ శ్రీధర్, ఆరఎంఒ విజయ్ కుమార్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ, రోగుల భద్రతతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నందుకే బెస్ట్ షేరింగ్, ఎకో ఫ్రెండ్లీ విభాగాల్లో ఈ అవార్డులు దక్కాయని తెలిపారు. వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పారిశుధ్య సిబ్బంది సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా ఇదే బాధ్యతతో భవిష్యత్తులో కూడా పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సిటీ కేబుల్ ఎండి కొట్టే సదానందం తదితరులు పాల్గొని ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.



వీరజవాన్ రమాకాంత్ కుటుంబానికి తోటి జవాన్ల చేయూత

రూ,,1,52,001 ఆర్థిక సాయం అందజేత..

సహచరుడి కుటుంబానికి అండగా నిలిచిన సిఆర్పిఎఫ్ జవాన్లు

జూలపల్లి,ప్రభాతవార్త: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వడ్కాపూర్ గ్రామానికి చెందిన సిఆర్పిఎఫ్ జవాన్ మొగురం రమాకాంత్ కుటుంబానికి తోటి సిఆర్పిఎఫ్ జవాన్లు అండగా నిలిచారు.సహచరుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చి రూ ,, 1,52,001 (లక్ష యాభై రెండు వేల ఒక రూపాయి) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రమాకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న వడ్కాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల రామ్మూర్తి యాదవ్ తన బాల్య మిత్రుడు, గోదావరిఖనికి చెందిన సిఆర్పిఎఫ్ జవాన్ చిక్కులపల్లి మనోహర్ రావును సంప్రదించారు. తమిళనాడు కోయంబత్తూర్ లో విధి నిర్వహణలో ఉన్న మనోహర్ రావు రమాకాంత్ కుటుంబ పరిస్థితిని మనోహర్ రావుకు వివరించి, కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.దీనిపై స్పందించిన చిక్కులపల్లి మనోహర్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తమ సిఆర్పిఎఫ్ జవాన్లను సంప్రదించి, రమాకాంత్ కుటుంబానికి తమవంతు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు.తోటి జవాన్ల సానుభూతితో స్పందించి తమవంతు సహాయాన్ని అందించడంతో మొత్తం రూ,, 1,52,001 సమకూరింది.అనంతరం తోటి సిఆర్పిఎఫ్ జవాన్లు రమాకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, రమాకాంత్ తమ మధ్య లేకపోయినా ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.దేశ సేవలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన సహచరుడి కుటుంబానికి తోటి జవాన్లు కష్టకాలంలో అండగా నిలవడం పలువురి ప్రశంసలు అందుకుంది.సహచరుడి పై ఉన్న ఆత్మీయతను ఆర్థిక సహాయం రూపంలో చాటుకున్న జవాన్ల మానవత్వం అభినందనీయం అని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ జవాన్లు చిక్కులపల్లి మనోహర్ రావు,చుంచు నరేష్,ఐలి కిరణ్ కుమార్,స్థానికులు వేల్పుల రామ్మూర్తి యాదవ్,అట్ల సంతోష్ యాదవ్,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.





రోడ్లపై పార్కింగ్ చేస్తే జరిమానాలే!..

ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించాలి..

ఆటో, జీప్ డ్రైవర్లకు ఎస్ఐ చంద్రకుమార్ హెచ్చరిక

సుల్తానాబాద్, ప్రభాతవార్త: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతూ రహదారులపై అస్తవ్యస్తంగా వాహనాలను పార్కింగ్ చేస్తే జరిమానాలు విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆటో, జీప్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పట్టణంలో జనాభాకు అనుగుణంగా రహదారులను వెడల్పు చేసినప్పటికీ కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలను నిలిపివేస్తున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతోపాటు ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ క్రమశిక్షణ పాటిస్తూ రహదారులపై వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకూడదని సూచించారు. రేగడి మద్దికుంట, కొలనూర్, పెగడపల్లి, కాల్వ శ్రీరాంపూర్, గట్టేపల్లి, నీరుకుళ్ల, కదంభాపూర్ గ్రామాలకు వెళ్లే ఆటోలకు నిర్దేశిత ప్రాంతాలను కేటాయించినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తే జరిమానాలతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆటో, జీప్ డ్రైవర్లతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు సిద్ధమైన మొర్రాయిపల్లె స్తంభాలను ఏర్పాటు చేసిన అంజిరెడ్డి

ముస్తాబాద్ ప్రభాత వార్త:



ముస్తాబా ద్ మండలం మొర్రాయి పల్లె గ్రామ ములో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి నూ తనంగా ఏర్పాటు చేసిన వేడుక లకు సిద్ధమైన బతుకమ్మ ఘాటుకు స్తంభాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమ ములో గ్రామ సర్పంచ్ మేన్గని శ్రీనివాస్,ఉప సర్పంచ్ పల్లె ఆనంద్,వార్డు మెంబర్ సడిమెల మల్లేశం,స్వప్న,కార్యదర్శి రాజు,కరోబార్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్ నినో ను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు వరి వేయవద్దు : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త : ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వివిధ శాఖల అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, భూగర్భ జల శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, మిషన్ భగీరథ, గ్రామీణ అభివృద్ధి శాఖ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి తదితర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రాజెక్టులలో నీటిమట్టాలు క్రమంగా తగ్గడం, భూగర్భ జలాలు రాను రాను తగ్గుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు సూచన మేరకు రైతులు వరి వేయవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికార సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు కూరగాయలు, పప్పు దినుసులు, ఆయిల్ ఫామ్ తదితర పంటల సాగుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్ రీఛార్జి గుంతలు, పామ్ పాండ్, మ్యాజిక్ సోక్ పిట్ తదితర పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కూలీలకు వీబీజీ రామ్ జీ కింద నిర్దేశిత లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేయించాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, యంత్రాలు ఇతర ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆయా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే నీటి వృథాను అరికట్టాలని సూచించారు. మున్సిపాలిటీల, గ్రామపంచాయతీ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జల శాఖ అధికారులు జలాల లభ్యత, నీటి మట్టాలపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ పీడీసీఎల్ అధికారులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు అవసరమైన గడ్డి, నీటి తొట్టిల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో నీటి తొట్టిల నిర్వహణ, మరమ్మత్తు, నీటిని నింపడం అంశాలను జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. గడ్డి పెంపకానికి కావలసిన అన్ని విత్తనాలు ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పుడు ఉన్న వాతావరణ పరిస్థితులు, భవిష్యత్తు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు .ఈ సమావేశంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అష్జల్ బేగం, ముఖ్య ప్రణాళిక అధికారి సంపత్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, జిల్లా వైద్య అధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, డీపీఓ వీర భద్రయ్య, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికా బద్ధంగా రీ సర్వే పనులు

నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే, ఎంజాయ్మెంట్ పనుల పరిశీలన.

జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ప్రసూనాంబ

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:

భూముల రీ సర్వే పనులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)ఎన్. ప్రసూనాంబ అన్నారు.మండలంలోని మేడిపెల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఎన్. ప్రసూనాంబ శుక్రవారం పరిశీలించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ మాట్లాడుతూ..భూ రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా,పకడ్బందీగా చేపట్టి,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది,ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు.సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సర్వే సిబ్బందికి సూచించారు.భూ సమస్యలకు శాశ్వత



పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని,రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని,గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.మొదట గ్రామ బౌండరీ పై లైసెన్స్డ్ సర్వేయర్లు,మండల సర్వేయర్ లు కలిసి రీ సర్వే చేస్తారని,తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని ఆమె తెలిపారు.ఈకార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు

నవ దుర్గా సేవాసమితి దసరా ఉత్సవాల ఆహ్వానం

మల్లాపూర్ ప్రభాతవార్త

:మల్లాపూర్ పాత బస్టాండ్ నవదుర్గ సేవా సమితి, కనకదుర్గ సేవాసమితి మల్లాపూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం రోజున కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, పోలాస అజయ్ చారి, డాక్టర్ రామకృష్ణ,వింతలూరి రంజిత్, మోర సతీష్, ఉయ్యాల లక్ష్మణ్, సిరిపురం రవీందర్, కోటగిరి ఆనంద్ గౌడ్‌లతో పాటు



పలువురు కమిటీ సభ్యులు పాల్గొని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు.

మాంసం విక్రయ దారులు పై చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు వినతి

మెట్ పల్లి డివిజన్, ప్రభాత వార్త:

పట్టణంలో మాంసం విక్రయ దారులు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పట్టణానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ మాంసం విక్రయ దారులు పశు సంవర్ధక శాఖ అధికారులు ఆమోదించిన వాటినే కోసి విక్రయించాలని కానీ మాంసం విక్రయ దారులు మాత్రం నాసిరకం మేకలను గొర్రులను కోసి పొట్టేలు మాంసం గా విక్రయిస్తున్నారని ఆరోపించారు.చనిపోయిన వాటిని కోసి విక్రయిస్తున్నారని



వాటివల్ల ప్రజలు అనారోగ్యాలకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. తూకం లో మోసం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల మురళి , నిరటినరేందర్, మాడావేనీ సత్తయ్య సయ్యద్ బాబా పాల్గొన్నారు.

రత్నాపూర్ లో ఘనంగా బోనాల జాతర



మల్లాపూర్ ప్రభాతవార్త:

మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవి అమ్మవారు భక్తుల నుండి ప్రత్యేక పూజలు అందుకుంటూ దర్శనమిస్తున్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకొని ఆరవ రోజు గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్, మహిళలతో కలిసి బోనమెత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అదేవిధంగా కుస్తాపూర్ గ్రామంలో సైతం మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక నైవేద్యాలను వండుకొని బోనాలతో ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమాలలో , ఇరు గ్రామాల దుర్గాదేవి కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు మహిళా భక్తురాలు పాల్గొన్నారు.

గరుడ వాహనం పై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:



దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఇబ్రహీంపట్నంలో శుక్రవారం రోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారు గరూడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి మంగహారతులతో స్వాగతం పలుకుతూ గ్రామ ప్రజలంతా స్వామి వారిని దర్శించుకున్నారు.

రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్‌పల్లి పట్టణంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ గేట్ వాల్వ్ మరమ్మతు పనుల కారణంగా అక్టోబర్ 17, 18 తేదీల్లో తాగునీటి సరఫరా కొంతమేర తగ్గే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు తక్కువ పరిమాణంలో నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. పనులు పూర్తయిన వెంటనే సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు రెండు రోజుల పాటు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రెండు గ్రామాల్లో భూముల రీసర్వే అవగాహన

చిగురుమామిడి, ప్రభాత వార్త :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా చిగురుమామిడి మండలం ముదిమాన్నిక్య, రామంచ గ్రామాన్ని రీ సర్వే కింద ఎంపిక చేయబడినట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా నేడు శనివారం రోజున ఉదయం పది గంటల నుండి పన్నెండున్నర వరకు రైతు వేదిక, గ్రామ పంచాయతీ కార్యాలయం నందు భూ భారతి భూముల రీ సర్వే అవగాహన సదస్సు గ్రామ సర్పంచ్ ల గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇట్టి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్, ఏ డీ కరీంనగర్ కిషన్ రావు, తహశీల్దార్ కనుకయ్య, డీ ఐ, మండల సర్వేయర్ తదితరులు హాజరై ఇట్టి భూ భారతి రీ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేయుదురు. కావున ఇట్టి సమావేశానికి రైతులు అందరూ సకాలములో హాజరు కావాలని, మీయొక్క సందేహాలను నివృత్తి చేసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులు కోరుతున్నారు

మెట్‌పల్లి వార్త

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జనసేన నాయకుడికి ఘన సన్మానం



మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్ పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక వాసవి మాత ఆలయంలో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జనసేన పార్టీ కోరుట్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు గంగం అజయ్ కుమార్ ని శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు మాట్లాడుతూ గంగం అజయ్ కుమార్ ఎప్పుడూ ఆర్యవైశ్య సంఘానికి ఆలయ అభివృద్ధికి అండగా ఉంటున్నారని కొనియాడారు.అనంతరం అమ్మవారి శాలువాతో పూల మాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోట కిరణ్ జొన్నల శ్రీను బండారి గోపి పుల్లూరీ నవీన్ చాడ చందు, ఎలిమి రవి, వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట



చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం సుందరగిరి, కొండాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు పొలం బాటలో భాగంగా శుక్రవారం పంట పొలాలను సందర్శించి రైతులతో వ్యవసాయం లో విద్యుత్ వినియోగం, విద్యుత్ పొదుపు వంటి విషయాల గురించి మాట్లాడారు. వరి పంటలను, నీటి, విద్యుత్ వినియోగం పరిశీలించారు.విద్యుత్ సమస్యలపై సిబ్బంది దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏస్ ఈ విజేందర్ రెడ్డి,డీ ఈ తిరుపతి, ఇందుర్తి సబ్ స్టేషన్ పరిధి ఏ ఈ అన్వేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిరంతర విద్యుత్ కోతలు లేకుండా చూడాలని శాఖ అధికారుల ను రైతులు కోరారు.

దుర్గమ్మ ఆలయం కు విద్యుత్ స్తంభాల ఏర్పాటు:

చందుర్తి : ప్రభాతవార్త



చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో పోచమ్మ గుట్ట వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయానికి నూతనంగా విద్యుత్ స్తంభాల ను గ్రామ సర్పంచ్ మరాటి మల్లిక్ శుక్రవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ గుడి వద్ద కరెంట్ లైట్లు ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేసిన ఇదే గ్రామానికి చెందిన తాహా సిల్దార్ గుర్రం శ్రీనివాస్. విద్యుత్ శాఖ ఏఈ పృథ్వీ. బీఆర్ఎస్ నాయకులు బైరగోని రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో గుట్ట పైకి నీటి సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ,ఉప సర్పంచ్ పూడూరు జీవన్ రెడ్డి. జూనియర్ లైన్ మేన్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు నీళ్లు తెలంగాణ రైతులకు కన్నీళ్లు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రకు నీళ్ల మళ్లించి, తెలంగాణ రైతులకు కన్నీళ్ల మిగిల్చిందని బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయా అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే ఖిస్కాంగ్రెస్ఖి అని, భారీ బొగ్గు కుంభకోణానికి పాల్పడి దాదాపు 3 వేల కోట్ల రూపాయల స్కామ్ చేశారని ఆరోపించారు. అవినీతి కారణంగానే నేడు రైతులకు కరెంట్ లేకుండా చేశారని విమర్శించారు. పండిన పంటకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే నెపంతోనే, రైతులకు సాగునీరు, కరెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగయ్య పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత కరెంట్, పుష్కలంగా సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేస్తే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమీ ఇవ్వకుండా రైతాంగాన్ని గోస పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగిలో వరి వేయవద్దని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మరి తెలంగాణ రైతులు ఎలా బతకాలని, వారికి ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం



కు ముందుచూపు లేకపోవడం వల్లే రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం తలెత్తిందని అన్నారు. లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం అయిందని, దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ , సెస్ చైర్మన్ చిక్కాల రామారావు , పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మ్యాన రవి, గజాభింకర్ రాజన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ప్యాక్స్ చైర్మన్

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని దుర్గామాత అమ్మవారిని ప్యాక్స్ చైర్మన్ వెంకట రమణారెడ్డి,పాలకవర్గ సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ వెంకట రమణారెడ్డికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన భక్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి రాజు పాల్గొన్నారు. యువజన సంఘాల అధ్యక్షుడు కార్తీక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

గరుడ హాస్పిటల్ బతుకమ్మ వేడుకలు

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త

తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణంలోని ప్రముఖ గరుడ హాస్పిటల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ మహిళా సిబ్బంది, వైద్యులు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది అందరూ సాంప్రదాయ వస్త్రధారణలో హాజరై పండుగ శోభను మరింత ఇనుమడింపజేశారు.

బతుకమ్మ వేడుకలకు సిద్ధమైన మొర్రాయిపల్లె స్తంభాలను ఏర్పాటు చేసిన అంజిరెడ్డి

ముస్తాబాద్ ప్రభాత వార్త:

ముస్తాబాద్ మండలం మొర్రాయి పల్లె గ్రామములో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన వేడుకలకు సిద్ధమైన బతుకమ్మ ఘాటుకు స్తంభాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ మేన్గని శ్రీనివాస్, ఉప సర్పంచ్ పల్లె ఆనంద్, వార్డు మెంబర్ సడిమెల మల్లేశం, స్వప్న, కార్యదర్శి రాజు, కోబార్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెంకట్రావుపల్లెలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో ఏడవ రోజు సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గ్రామంలో పండుగ సందడిని నింపారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. గ్రామంలో బతుకమ్మ వేడుకల నిర్వహణకు గ్రామ సర్పంచ్ నవీన్ రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పండుగ ప్రశాంతంగా, సంతోషకరమైన వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టారు. పూల పండుగతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గ్రామీణ సంస్కృతిని చాటిచెబుతోంది. సద్దుల బతుకమ్మ వేడుకలతో వెంకట్రావుపల్లె గ్రామంలో పండుగ వాతావరణం

మండేపల్లిలో ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నీ

విజేతలకు బహుమతుల ప్రధానం.

.తంగళ్ళపల్లి ప్రభాతవార్త.

.తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ వి సి హెచ్ సీజన్2 ఘనంగా ముగిసింది. దేవి నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహించిన ఈ టోర్నీలో మండలంలోని వివిధ గ్రామాల నుండి 6 జట్లు పాల్గొన్నాయి. నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో ఆశోక్ లెవెన్ టీం ప్రథమ స్థానం, రాఖీ లెవెన్ టీం ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మని రామలింగారెడ్డి రూ.10 వేల నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య రూ.7 వేల నగదు బహుమతిని సర్పంచ్ గనగొని సాగర్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గనగోని సాగర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల వార్త



పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ కానుక

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములోని అనంతారం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని గ్రామపంచాయతీ సిబ్బందికి శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో సిబ్బంది సేవలు అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. సిబ్బందిని ప్రోత్సహిస్తూ గ్రామాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతి, పాలకవర్గ సభ్యులు అక్కెమ్ ఉపేందర్, గోనేపల్లి లావణ్య, మల్యాల రాజశేఖర్, బట్టి క్రాంతి, వొల్లాల లత, కృష్ణకుమార్, చొప్పరి సాయిలు, సిరిపురం రమేష్, చల్ల వైష్ణవి, భాస్కర్, కారోబార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఘనంగా కుంకుమ పూజ

తంగళ్ళపల్లి, ప్రభాతవార్త.



.తంగళ్ళపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామంలో శ్రీ అంభ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో 108 మంది మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రచనచోటు, సేవా సమితి సభ్యులు, అర్చకులు బొద్దుల శ్రీనివాస్ గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ సేవాసమితి

అమ్మవారి మండపంలోగోపూజ

..తంగళ్ళపల్లి, ప్రభాతవార్త..



తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జగదంబ సేవా సమితి ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపం వద్ద గోవులను పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించి, పసుపు, కుంకుమ, గంధంతో పూజలు చేశారు. గోవులో 33 కోట్ల దేవతలు కొలువై ఉంటారని, గోపూజ వల్ల సకల శుభాలు కలుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మచ్చ శ్రీనివాస్, మోర రాజు, సామల రమేష్ అంకారపు మహేష్, జగదంబ సేవాసమితి సేవాసభ్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సరైన జీవనశైలితో వెన్నునొప్పికి చెక్

సెల్‌ఫోన్, గ్యాడ్జెట్ల మితిమీరిన వాడకంతో మెడ, నడుము నొప్పులు

– మెడికవర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, కూర్చునే భంగిమలో లోపాలు, సెల్‌ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్ల మితిమీరిన వినియోగం కారణంగా మెడ, నడుము నొప్పుల సమస్యలు పెరుగుతున్నాయని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ స్పైన్ డే సందర్భంగా శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ సరైన జీవనశైలి, క్రమం తప్పని వ్యాయామం, తగిన జాగ్రత్తలతో వెన్నుముక సమస్యలను చాలావరకు నివారించవచ్చని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చాలామంది మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారని, కొన్ని సందర్భాల్లో మెడ భాగంలోని వెన్నుముక నరాలపై ఒత్తిడి పడటంతో తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. రోజూ వ్యాయామం చేయడం, కూర్చునేటప్పుడు, నిలబడేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం, ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోకుండా మధ్యమధ్యలో కదలడం, ఫోన్, ల్యాప్‌టాప్ వినియోగాన్ని పరిమితం చేయడం ద్వారా వెన్నుముక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వెన్నుముక శస్త్రచికిత్స లంటే భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతతో మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ విధానంలో చిన్న గాటు ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స జరిగిన రోజే లేదా మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఇటువంటి ఆధునిక చికిత్సా సదుపాయాలు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ వినయ్ కుమార్, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, మనోజ్ కుమార్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చిన జయదుర్గా మాత

విద్యానగర్ లో వైభవంగా సామూహిక సరస్వతీ పూజలు

చిన్నారుల అక్షరాభ్యాసం



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:.జగిత్యాల పట్టణం విద్యానగర్ లో కొలువైన జయ దుర్గా మాత ఆలయం శుక్రవారం భక్తి శ్రద్ధలతో పులకించింది. జయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకరణలో దేదీప్యమానంగా దర్శనమిచ్చి, భక్తులకు అభయ ప్రదాయినిగా నిలిచారు. తెల్లని వస్త్రధారణలో, చేతిలో వీణ, పుస్తకం ధరించి, హంసవాహినిగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. విద్యకు అధిష్టాత్రి అయిన సరస్వతీ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావించారు.చిన్నారులకు అక్షరాభ్యాసం: ఈ పవిత్ర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. “ఓం శ్రీ సరస్వత్యై నమః“ నామస్మరణతో చిన్నారుల చేత పలకపై ఓం నమః శివాయ అని రాయించి, వారి విద్యా జీవితం విజయవంతం కావాలని అర్చకులు ఆశీర్వదించారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి సేవ: ఈ మహోత్సవానికి హైకోర్టు అడ్వకేట్ అజయ్ రెడ్డి అన్నప్రసాద దాతగా వ్యవహరించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం నిరాడంబరంగా భక్తుల మధ్య ఉండి, స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి తన భక్తి భావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు, జున్ను రాజేందర్, సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, దాసరి శేఖర్, అలిశెట్టి కిషన్బిట్టు, గాదే కార్తీక్, సింగారావు, నడిపి గంగారాం, ఫణి భూషణ్, ప్రసన్న, శ్రీరామ్, భగీరథ, నాలువాలా భగీరత్, అలిశెట్టి సాయి భూషణ్, సాయి, హరీష్, రామ్ చందర్, ద్యావానపల్లి శంకర్, మాధురి, ఆయాన్స్, ఆధ్వి,తదితర యువజన సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు

జేపి వ్యాఖ్యలపై టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్.



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: లోక్ సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ల ఆర్థిక భద్రతపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని తెలంగాణ పెన్షనర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం అసోసియేషన్ కా ర్యాలయంలో జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యలపై ఉద్యోగ, పెన్షనర్ల ఆగ్రహం “ పై జరిగిన జిల్లా స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య పిలుపు మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఐ ఏ ఎస్ అధికారిగా, శాసనసభ్యులుగా పని చేసిన ఆయన క్షేత్ర స్థాయిలో 30ఏళ్ల కు పైగా ప్రభుత్వంకు, ప్రజలకు సేవలందించిన పెన్షనర్లకు ఇచ్చే పెన్షన్ వలన ఆర్థిక అత్యవసర పరిస్థితి వస్తుందనడం సరి కాదన్నారు.ఉద్యోగి వృద్ధాప్యంలో గౌరవ ప్రదంగా జీవించేందుకు పొందే సామాజిక భద్రతే పెన్షన్ అని, అది ఎవరో వేసే బిక్ష కాదని తేల్చి చెప్పారు.ప్రజా ప్రతినిధుల పెన్షన్లు ఇతర ఖర్చులపై ప్రశ్నించని వారు ఉద్యోగుల పెన్షన్లపైనే భారమంటూ మాట్లాడడం ద్వంద నీతికి నిదర్శనమన్నారు. తెలంగాణ లో రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బకాయిలు, పెండింగ్ డి ఏ లు, పీ ఆర్సీ వంటి సమస్యల్తో సతమతమవుతున్న ఉద్యోగులను, పెన్షనర్లకు అండగా నిలువాల్సింది పోయి, ప్రజలకు, ఉద్యోగుల మధ్య విబేధాలు సృష్టించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఉద్యోగుల, పెన్షనర్ల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే యత్నాలను సహించేది లేదని జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో టి పి సి ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హన్మంత్ రెడ్డి,కోశాధికారి గౌరి శెట్టి విశ్వ నాతం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ప్రకాష్ రావు, ఎం. డి. యాకూబ్, ఎస్. జి. పి. ఏ. టి. జిల్లా అధ్యక్షులు పూసాల అశోక్ రావు, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు కే. మురళి, జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి. రాజేశ్వర్ వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో రాత్రి వేళల్లో తప్పునున్న చీకటి కష్టాలు

రైతులు,ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ లైన్



జగిత్యాల.రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ నర్సింగాపూర్ గ్రామంలో ప్రజలు,రైతుల సౌకర్యార్థం సర్పంచ్ కుక్కునూరి వంశీ నాయకత్వంలో నూతన విద్యుత్ లైన్ నిర్మాణాన్ని చేపట్టారు.గ్రామంలోని రోడ్ నంబర్ 16 నుండి బాల్దారం చెరువు కట్ట వరకు చీకట్లను పారద్రోలుతూ 23 నూతన విద్యుత్ స్తంభాలను పాలకవర్గం ఆధ్వర్యంలో విజయవంతంగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుక్కునూరి వంశీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే సంకల్పంగా, ప్రజాసేవే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వీధిదారులకు, పంట పొలాలకు వెళ్లే రైతులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామాభివృద్ధికి సమన్వయంతో సహ కరించిన విద్యుత్ శాఖ ఏడి జవహర్ నాయక్, ఏఇ శ్రీధర్,లైన్ మెన్లతో పాటు గ్రామ ప్రజలకు, రైతులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జగిత్యాల వార్త



కొడిమ్యాల పీడీకి రాష్ట్రస్థాయి గుర్తింపు

ఎస్జీఎఫ్ లాన్ టెన్నిస్ పోటీల అబ్జర్వర్‌గా బూట్ల రాజమల్లయ్య..

24 ఏళ్ల క్రీడా సేవకు దక్కిన అరుదైన అవకాశం



కొడిమ్యాల, ప్రభాతవార్త: క్రీడారంగంలో విశేష సేవలందిస్తున్న కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్యకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు అబ్జర్వర్‌గా ఆయన నియమితులయ్యారు. 24 ఏళ్ల సర్వీసులో తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలకు అబ్జర్వర్‌గా అవకాశం లభించడంతో ఆయన సహచరులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలో గల లాన్ టెన్నిస్ కోర్టులో అండర్17 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీల పర్యవేక్షణకు రాజమల్లయ్యను నియమిస్తూ ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ. ఉషారాణి ఈ నెల 12న అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజమల్లయ్య మాట్లాడుతూ తన సుదీర్ఘ సర్వీసులో తొలిసారిగా రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ లాన్ టెన్నిస్ పోటీలకు అబ్జర్వర్‌గా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ. ఉషారాణికి, నియామకానికి సహకరించిన కార్యదర్శులు వాసుదేవరావు, చక్రధర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజమల్లయ్య నియామకం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, డీవైఎస్ఓ డాక్టర్ రవికుమార్, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ అధికారి శ్రీనివాస్, కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

నిరుపేద విద్యార్థి ఎంబిబిఎస్ చదవడానికి అండగా నిలిచిన ఎస్పీఎఫ్ ట్రస్ట్

25 వేల రూపాయల ఆర్థిక సహకారం అందించిన ఎస్పీఎఫ్ ట్రస్ట్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల పట్టణానికి చెందిన భోగ విష్ణువర్ధన్ అనే విద్యార్థికి ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో ఆదిలా బాద్ రిమ్స్ లో ఎంబిబిఎస్ సీట్ వచ్చింది. కానీ నిరుపేద కుటుంబం, తండ్రి ఆటో డ్రైవర్ గా పని చేయడం, వైద్య విద్య చదవడానికి డబ్బులు లేక నిస్సహాయ స్థితి నెలకొన్నది. ఇట్టి విషయము గత కొన్ని రోజుల క్రితం డాక్టర్ సీటు వచ్చింది... పేదరికం అడ్డొచ్చింది... ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థి... అనే శీర్షికతో పలు వార్తాపత్రికల్లో కథనాలు రావడం జరిగింది. ఇట్టి వార్త కథనాలు తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన శ్యామ్ ప్రసాద్ లాల్ తను మరియు తన మిత్ర బృందం తో నడుస్తున్న శ్యామ్ ప్రసాద్ లాల్ ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్(ఎస్పీఎఫ్ ట్రస్ట్) ద్వారా సహాయం చేద్దాం అనే ఉద్దేశంతో అబ్బాయి తల్లిదండ్రులతో మాట్లాడి,వివరాలను కనుగొనడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం రోజున ఎస్పీఎఫ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ గోనె శ్రీనివాస్ మరియు ట్రస్ట్ బాధ్యులు, జగిత్యాల జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గుగ్గిళ్ళ సత్యం, బట్టు హరికృష్ణ తదితరులు జగిత్యాల కి వెళ్లి జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రసూనాంబ చేతుల మీదుగా అట్టి నిరుపేద విద్యార్థి భోగ విష్ణువర్ధన్ ఎంబిబిఎస్ చదవడానికి 25వేల రూపాయల ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రసూనాంబ మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించి, మంచి డాక్టర్ గా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఇదేనా ...ప్రజాస్వామ్యం ఉన్నట్టా లేనటా

పోలీస్ లు ప్రజలకు రక్షణగా ఉండాలి

.జర్నలిస్టుల పై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానవీయం.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు తెలంగాణ ఉద్యమకారురాలు విమలక్క

కరీంనగర్, ప్రభాతవార్త



:విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానవీయమని, రాష్ట్రం లో ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఇదేనా అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు తెలంగాణ ఉద్యమకారురాలు విమలక్కఅన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లను విమలక్క శుక్రవారం పరామర్శించారు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియా తో మాట్లాడుతూ విమలక్క మాట్లాడుతూ , జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు..రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టులపై కేసులు పెరుగుతున్నాయని, పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించలేని పరిస్థితులు నెలకొనడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే జర్నలిస్టులపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం తీవ్రమైన విషయమని అన్నారు. ప్రశ్నించే గొంతుకలను భయపెట్టడం, బెదిరించడం, విధి నిర్వహణలో వేధించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు న్యాయం డిమాండ్ చేశారు.

పంటలు వేయొద్దనడం సిగ్గుచేటు

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రణాళిక ఏదీ?

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం

.కరీంనగర్, ప్రభాతవార్త :



ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందంటూ రైతులను ఆందోళనకు గురిచేయడం కాకుండా, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికను వెల్లడించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. యాసంగి పంటలు వేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రైతులకు అండగా నిలవాలిరైతులకు 24 గంటల విద్యుత్తు అందించాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో నాలుగు గంటలే సరఫరా అవుతోందని రవిశంకర్ ఆరోపించారు. విద్యుత్తు కోతలతో పంటలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరేటర్లను వినియోగించాల్సి రావడంతో రైతులపై అదనంగా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు భారం పడుతోందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం.. పంటలు వేయొద్దని సూచించడం ఏమిటని ప్రశ్నించారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే, రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించాలితెలంగాణలో ప్రాణహిత, గోదావరి వంటి నదులు ఉన్నప్పటికీ సాగునీటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని రవిశంకర్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, అవసరమైన మరమ్మతులు చేపట్టి సాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినప్పుడు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటిని అందుబాటులో ఉంచేందుకు ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.కరెంటు కోతలకు ప్రభుత్వమే బాధ్యబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతర విద్యుత్తు అందించామని, కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించామని రవిశంకర్ పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. 24 గంటల విద్యుత్తు, మూడు పంటలకు రైతుభరోసా, ఎకరానికి రూ.15 వేల సాయం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కేంద్రాల నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని, బొగ్గు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.రైతులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేయడంతో పాటు, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని సుంకె రవిశంకర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ , మాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

నిజాలు రాస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గుచేటు

ఎస్సైని వారి అనుచరులు తక్షణమే సస్పెండ్ చేయాలి

బిజెపి ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీ నారాయణ డిమాండ్

జర్నలిస్టులపై దాడి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి.-

సంపత్, కొత్తూరు శేఖర్‌లకు న్యాయం చేయాలి.

!! బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి

.కరీంనగర్, ప్రభాతవార్త



:కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ..ఏక్ దమ్ న్యూస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సంపత్, ఎడిటర్ కొత్తూరు శేఖర్‌లను బిజెపి ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీ నారాయణ పలువురితో కలిసి పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి న్యాయం జరగాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్ఐ చుక్కల శ్రీకాంత్‌తో పాటు నలుగురు కానిస్టేబుళ్లు జర్నలిస్టులను కరీంనగర్ నుండి కిడ్నాప్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి, తీవ్రంగా కొట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, జరిగిన పరిణామాలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి జరిగిందనే ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, బాధితుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉన్నంత అధికారులను కోరారు. నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులను నిర్బంధించడం, దాడి చేయడం, జరిపించాలి. వైద్య పరీక్షలు, ఆధారంగా వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు చేయాలి ఎస్ఐ తో పాటు నలుగురు కానిస్టేబుల్ లను తక్షణమే విధులు నుండి సస్పెండ్ చేయాలి బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీ నారాయణ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు ఎడ్ల సురేష్ లింగంపల్లి కళ్యాణ్ చందు రాజశేఖర్ పాల్గొన్నారు

కరీంనగర్ వార్త

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి వారోత్సవాలు

కరీంనగర్ టౌన్ ప్రభాతవార్త:



సమాజంలోని నిరుపేద మరియు అణగారిన వర్గాలకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందించాలనే తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, భగతనగర్ లయన్స్ క్లబ్ బృందం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని 43 వ డివిజన్ ,గోడాంగడ్డ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, తోకల భూమేశ్వర్,కార్యదర్శి వాసాల రామచంద్రం , మరియు కోశాధికారి తన్నీరు వెంకటేశ్వరావు రావు,వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ,చార్టర్ ప్రెసిడెంట్ రవీందర్ , మైక్రో కాబినెట్ సిర్పురం ప్రసాద్ ,ప్రభాకరరెడ్డి ప్రెసిడెంట్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్మార్ట్సిటీ కరీంనగర్,లయన్ సభ్యులు బండిపల్లి రమణ, కనపర్తి రఘు ,కోడూరి మహేష్,పాక రఘునందన్,కంచనపల్లి మహేందర్ రాజ్, జయసేనారెడ్డి ,కృష్ణ ,యంసాని శ్రీనివాస్, బొద్దుల సత్యనారాయణ, సీటీ రామారావు, గంగాతిరుపతి పటేల్,పాల్గొన్నారు. మానేర్ స్విమ్మర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాశం రాజారెడ్డి మరియు స్విమ్మర్ సభ్యులు,కార్పొరేటర్ లక్ష్మీ,మొండన్న హాజరయ్యారు.ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చింతల ప్రభాకర్, పాల్గొని, 100 మంది కి కంటి పరీక్షలు నిర్వహించారు.

బావుపేట ఖాజీపూర్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ



కొత్తపల్లి అక్టోబర్ 16 (ప్రభాత వార్త)

కొత్తపల్లి మండలం బావుపేట, ఖాజీపూర్ గ్రామాలలో బతుకమ్మ వేడుకల ఏడవ రోజు సద్దుల బతుకమ్మను జరుపుకునే ఆనవాయితీ ఉండడంతో శుక్రవారం నాడు ఘనంగా సద్దుల బతుకమ్మ జరుపుకున్నారు. గ్రామాలలోని మహిళలు ఆడపడుచులు తీరక్క పూలతో అందమైన బతుకమ్మను పేర్చి గౌరమ్మలను పూజించి ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్యన వైభవంగా బతుకమ్మను ఆడుకున్నారు. బతుకమ్మ పాటలు దాండియా నృత్యాలతో లయబద్ధంగా బతుకమ్మలు ఆడుతూ మురిసిపోయారు.. బావు పేట గ్రామంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ మహిళలను ఉత్సాహపరుస్తూ బతుకమ్మ వేడుకలలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు

కరీంనగర్ రూరల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

తొమ్మిదో తరగతి విద్యార్థినిపై దాడి ఘట

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోడల్ స్కూల్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో తొమ్మిదో తరగతి అభ్యసిస్తున్న ఓ విద్యార్థినిపై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చేయి చేసుకున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఘటన వివరాలు:పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థినిని ప్రిన్సిపాల్ కొట్టినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన రూరల్ పోలీసులు వెంటనే స్పందించి ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేశారు.దర్యాప్తు ముమ్మరం:ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయి చారణ చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశంపైనా లోతుగా ఆరా తీస్తున్నారు. విచారణలో వెల్లడయ్యే వాస్తవాలు, సేకరించిన సాక్ష్యాధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు వెల్లడించారు. విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన పాఠశాల యాజమాన్యమే ఇలా దాడులకు పాల్పడటం స్థానికంగా, విద్యార్థి సంఘాల మధ్య తీవ్ర కలకలం రేపింది.

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

కిట్స్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సింగాపూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కె. శంకర్ మాట్లాడుతూ... పూర్వీకులు మనకు అందించిన గొప్ప సాంప్రదాయాలను అమూల్యమైన సంపదగా భావించి, వాటిని కాపాడుకుంటూ భావి తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి విద్యార్థుల పైనే ఉందని ఉద్ఘాటించారు. మహిళలకు, బాలికలకు బతుకమ్మ ఎంతో విశిష్టమైన పండుగ అని కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్. శశికళ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. ఇంద్రనీల్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె. మధులత, కార్యక్రమ సమన్వయకర్తలు గౌరీ



పుండలిక్, సుభద్ర, సుప్రీత, సుమతి తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు కలిసి సాంప్రదాయబద్ధంగా బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో పండుగను కన్నుల పండువగా జరుపుకున్నారు.

డీజే సౌండ్ సిస్టమ్‌లను పూర్తిగా నిషేధించాలి

సిఐకి ప్రజాసంఘాల నాయకుల వినతి పత్రం

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ మండల పరిధిలో విచ్చలవిడిగా వాడుతున్న డీజే సౌండ్ సిస్టమ్‌లను తక్షణమే నిషేధించాలని కోరుతూ హుజురాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) కరుణాకర్ కు పలు సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డీజేల భారీ శబ్దాల వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ శబ్దాల దాటికి కొందరు ప్రాణాలు సైతం కోల్పోయిన దాఖలాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీజేల హోరుతో చదువుకునే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి కార్యక్రమానికి ఇష్టానుసారంగా డీజేలు ఏర్పాటు చేయడంతో, యువకులు మద్యం మత్తులో నృత్యాలు చేస్తూ కుప్పకూలిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. యువత తాగుడుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, కాబట్టి ప్రజా సంక్షేమం దృష్ట్యా



డీజేల వినియోగాన్ని వెంటనే కట్టడి చేయాలని వారు సిఐకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య బీసి, ఎస్సీ, ఎస్టీ ఉద్యమ వేదిక మండల కన్వీనర్ సాదుల రవీంద్రబాబు, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ వేల్పుల రత్నం, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రవీందర్, సామాజిక ఉద్యమ నేత వేల్పుల ప్రభాకర్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య, నాయకులు రాజమోళి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కరెంట్ కోతలు

ఎండిపోతున్న పంటలు

కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫైర్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో కేవలం 6 గంటల విద్యుత్ మాత్రమే సరఫరా చేస్తూ రాష్ట్రాన్ని చీకట్లోకి నెడుతోందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హుజురాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరుగుతూ... కేసీఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతుల పంటలు కరెంట్ లేక కళ్ల ముందే ఎండిపోతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ నిర్వహణలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారులను బలిచేసి ప్రభుత్వ పెద్దలు బాధ్యతల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఎంత ఉంది...? అవసరాలు ఎంత...? కొనుగోళ్లకు పెడుతున్న ఖర్చు ఎంత...? తదితర అంశాలతో పాటు కరెంట్ కోతలకు గల అసలు కారణాలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర శ్వేతపత్రంఖి విడుదల చేయాలని



ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంపై నెపాలు నెట్టడం మాని, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించాలని హితవు పలికారు.ఇదే సమయంలో తెలంగాణకు ఆర్థికంగా అత్యంత కీలకమైన సింగరేణి సంస్థను సైతం ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, ఆదాయం, సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు, కార్మికుల హక్కుల రక్షణపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రైతులు పంటలు సాగు చేయడానికి అవసరమైన విద్యుత్ అందించడంలో ఎందుకు విఫలమవుతున్నారో, సింగరేణి భవిష్యత్తుపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదో తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, డిసిబి వైస్ చైర్మన్ పింగిళి రమేష్, తిరుపతి రావు, ఇంద్రసేన రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సంపత్ రావు, పొనగంటి సంపత్, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, వెంకటేష్, తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మణ్ రావు, గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవంబర్ 18న హలో కళాకారుడా ఛలో కరీంనగర్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

కళాకారుల సమస్యల పరిష్కారం కోసం సకల కళల జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 18న కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'హలో.. కళాకారుడా.. ఛలో కరీంనగర్' ధర్నా పోస్టర్‌ను జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరీంనగర్ కేంద్రంగా రాష్ట్రంలో జానపద విశ్వవిద్యాలయం, జానపద అకాడమీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కల్చర్ పాలసీ తీసుకురావాలని, పెండింగ్ పెన్షన్లు మంజూరు చేసి, ఎన్నికల మేనిఫెస్టోలో సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన కళాకారుల సంక్షేమ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసి జిల్లా చైర్మన్ బొజ్జ ఎల్లయ్య, కన్వీనర్ ఐల ప్రసన్న, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు



రుద్ర రామచంద్రం, జేఏసి సభ్యురాలు కుడికాల లక్ష్మి, కళాకారులు మెరుగు లక్ష్మి, సీనియర్ కళాకారులు లంకసిరి రాజ్ కుమార్, గజవెల్లి సమ్మయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త





మున్సిపల్ కార్యాలయంలో వైభవోపేతంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

.జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మెప్మా ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మల్లీశ్వరి, మెప్మా సిబ్బంది బతుకమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయబద్ధంగా"రామ రామ ఉయ్యాలో" అంటూ చప్పట్లతో బతుకమ్మ ఆటలు ఆడారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి చైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ మల్లికార్జున స్వామి సైతం ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను మరింత సందడిగా మార్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వికాస్ , సానిటరీ ఇన్ స్పెక్టర్ ఇల్లందుల రమేష్, కార్యాలయ సిబ్బంది మెప్మా టీఎల్ఎఫ్ ఓబీ కవిత, జ్యోతి, సీఆర్పీలు జ్యోతి, మంజుల, టీఎల్ఎఫ్ ఆర్పీ ప్రవంతి, ఆర్పీలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

పిఆర్టియు టిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పైడిపల్లి చంద్రమోహన్..

.జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

పిఆర్టియు టిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పైడిపెల్లి చంద్ర మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .అక్టోబర్ 15,16వ తేదీలలో నల్లగొండలోనీ జిఎం గార్డెన్స్ లో జరిగిన పిఆర్టియు టిఎస్ రాష్ట్ర 6వ కౌన్సిల్ సమావేశాలలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంకు చెందిన పైడిపల్లి చంద్ర మోహన్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పిఆర్టియు టిఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ లకు మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ రెడ్డి ,మధు,రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు,పలువురు సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇందిరా మహిళ శక్తి భవనాలకు భూమి పూజ

వీణవంక , ప్రభాత వార్త:

వీణవంక మండలము పోతిరెడ్డి పల్లి గ్రామము లో శుక్ర వారం రెండు ఇందిరా మహిళ శక్తి భవనాలైనా ఝాన్సీ,జాగృతి లకు గ్రామ సర్పంచ్ గజ్జెల్ల మొగిల్యయ్య తమ పాలక వర్గం, మహిళ సంఘ సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ లోహిత్ రెడ్డి,ఉప సర్పంచ్ సంధ్య, పరిపాటి లక్ష్మారెడ్డి,పరిపాటి పవన్ రెడ్డి,సి సి ఆనంద్,వి ఓ ఏ లు లక్ష్మి, పుష్ప లతో మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు

డి83, డి86 కాల్వల నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన

పెద్దపల్లి, ప్రభాతవార్త: సాగునీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా, పంటలకు అవసరమైన చివరి తడులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రధాన కాలువ వద్ద స్థానిక నాయకులతో కలిసి డి83, డి86 ప్రధాన కాల్వల నీటి సరఫరాను పరిశీలించారు. ఈ కాల్వల ద్వారా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు అందుతున్న సాగునీటి వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుత దశలో పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సంప్రదింపులు జరిపి ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసేందుకు అంగీకారం పొందినట్లు వెల్లడించారు. నీటి లభ్యత పరిమితంగా ఉన్నా రైతుల పంటలకు ప్రాధాన్యం ఇస్తూ సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 15 నుంచి 20 కిలోల వడ్ల



అదనంగా తీసుకుని రైతులకు నష్టం కలిగించారని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని, సాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సాగునీటి విషయంలో ప్రతిపక్షాలు వాస్తవాలను పక్కనపెట్టి అనవసర విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతులకు నీరు అందించేందుకు చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు. ఈ పరిశీలనలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లన్న, కౌన్సిలర్లు తోట ఫణీంద్ర, దొడ్డుపల్లి జగదీష్, సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్, మండల అధ్యక్షుడు కట్కూరి సుధాకర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ఇతర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందే!

జనవరి 15 నాటికి కొత్త ఆసుపత్రి భవనం సిద్ధం

జీవో 76 దరఖాస్తుల పరిశీలనకు ఈ నెల 25 తుది గడువు

ఫిబ్రవరిలోగా నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తి

ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పెంచాలి

గోదావరిఖని, ప్రభాత వార్త: రామగుండం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలో పర్యటించిన ఆయన రహదారి నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల భవనాలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. జీవో 76 దరఖాస్తుల ధ్రువీకరణ, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ పనితీరును సమీక్షించారు.

నిర్మాణాల్లో వేగం పెంచాలి

రామగుండం–లింగాపూర్ రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పైపులైన్లను సంబంధిత శాఖలు సమన్వయంతో త్వరగా తరలించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని జనవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్రాంతి నాటికి ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. నర్సింగ్ కళాశాల భవనాన్ని ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలన్నారు.

దరఖాస్తులపై క్షేత్రస్థాయి తనిఖీ

రామగుండం 36వ డివిజన్‌లో జీవో 76 కింద వచ్చిన దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం తనిఖీ చేయడంతోపాటు సంబంధిత భూములు సింగరేణి సంస్థకు చెందినవా? కాదా? అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను అక్టోబరు 25లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు మెరుగుపడాలి

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు,



సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్.. అందుబాటులో ఉన్న నిపుణుల వైద్యులతో శస్త్రచికిత్సల సంఖ్య పెంచాలని సూచించారు. శస్త్రచికిత్సల కోసం రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదానగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు, విద్యాసంస్థల్లో మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సోలార్ విద్యుత్ సరఫరాకు చర్యలు

మంథని మండలం చిల్లపల్లిలో గౌతమి, రామగిరి మహిళా సమాఖ్యలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్య సోలార్ ప్లాంట్‌ను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు 6,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం కాగా, ప్రత్యేక విద్యుత్ లైన్ లేకపోవడంతో ప్రస్తుతం సుమారు 4,500 యూనిట్లను గుంజపడుగు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రత్యేక లైన్ ఏర్పాటుకు రూ.28 లక్షలు అవసరమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.పర్యటనలో టీజీఎంఎస్ఐడీసీ అధికారి విశ్వప్రసాద్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఏఈ రమేష్, ఈఈ రామకృష్ణ, అదనపు డీఆర్డీఏ అధికారి రవీందర్, డీఈ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో నియంత్రిత ఔషధాల విక్రయాలపై తనిఖీలు

రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ రావు నేతృత్వంలో

ఆకస్మిక తనిఖీలు... ప్రిస్క్రిప్షన్లు, విక్రయాల రికార్డుల పరిశీలన

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ షాపుల్లో నియంత్రిత ఔషధాల విక్రయాలపై నిఘా పెంచినట్లు పెద్దపల్లి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ రావు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్కోటిక్, డ్రగ్స్ నిరోధక శాఖ, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాలతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రామడాల్, టాపెంటడాల్, నైట్రాజెపామ్, ప్రెగాబాలిన్, జోల్పిడెమ్, అల్ప్రాజోలం, కోడిన్ కలిగిన దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించిన రికార్డులు, వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, సేల్స్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఔషధ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే మందుల విక్రయాలు జరుగుతున్నాయా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియంత్రిత మందులను వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే విక్రయించాలని మెడికల్ షాపుల యజమానులు, సిబ్బందికి సూచించారు. విక్రయాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అనుమతి లేని విధంగా నియంత్రిత లేదా నిషేధిత ఔషధాలను విక్రయించడం, సరఫరా చేయడం వంటివి చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్, నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రసాద్ రెడ్డి (ఆర్ఐ), ఎస్ఐ ఆర్.ఎస్. యాదవ్, హెడ్ కానిస్టేబుల్ బి. మురళీకృష్ణతో పాటు నార్కోటిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త





బ్యాంకింగ్ లావాదేవీల్లో జాగ్రత్తలే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

బీవోఐ పెద్దపల్లి మేనేజర్ బానోత్ ప్రవీణ్ వర్మ

విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా రాఘవపూర్‌లో అవగాహన కార్యక్రమం

పెద్దపల్లి, ప్రభాతవార్త: ఆన్‌లైన్ చెల్లింపులు, డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల మాటలు నమ్మి డబ్బు పోగొట్టుకోవద్దని బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దపల్లి శాఖ మేనేజర్ బానోత్ ప్రవీణ్ వర్మ ప్రజలకు సూచించారు. శుక్రవారం రాఘవపూర్ గ్రామంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. బ్యాంకు లావాదేవీల సమయంలో అప్రమత్తతతో వ్యవహరిస్తే సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఖాతా వివరాలు, డెబిట్, క్రెడిట్ కార్డు నంబర్లు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద వెబ్ లింకులు, యూపీఐ పేమెంట్ రిక్వెస్టుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. వివరాలు నిర్ధారించుకోకుండా లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద చెల్లింపులకు స్పందించడం వల్ల ఆర్థిక నష్టం కలగవచ్చని హెచ్చరించారు. సైబర్ మోసం జరిగినట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, సంబంధిత బ్యాంకుకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, రాఘవపూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓదెలలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

ఓదెల,ప్రభాతవార్త ఓదెల మండల కేంద్రంలోని జగదాంబ సెంటర్‌లో కొలువుదీరిన దుర్గామాతకు మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని పూలు, పసుపు, కుంకుమలతో అలంకరించి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. కుటుం బాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలంతా ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించడంతో జగదాంబ సెంటర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళల భక్తిశ్రద్ధలు, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాతను దర్శించుకున్నారు.



సేఫ్టీ బెల్ట్ ఎక్కడ?

భారీ గ్రానైట్ రాళ్ల రవాణాతో బెంబేలెత్తుతున్న వాహనదారులు!

రక్షణ చర్యలు లేకుండానే రయ్.. రయ్.. అంటూ లారీల పరుగులు

స్పీడ్ బ్రేకర్ల వద్దా తగ్గని వేగం.. ప్రమాదం పొంచి ఉందని ఆందోళన

పట్టించుకోని అధికారులు.. చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



మల్యాల, ప్రభాతవార్త: రోడ్డుపై ప్రయాణం అంటేనే అప్రమత్తంగా ఉండాలి. అందులోనూ భారీ గ్రానైట్ రాళ్లను తరలించే లారీల మధ్య ప్రయాణించాల్సి వస్తే వాహనదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఒకవైపు ఇరుకైన రహదారి.. మరోవైపు వాహనాల రద్దీ.. ఇంకోవైపు ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా భారీ గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీలు.. వెరసి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. లారీల్లో పెద్దపెద్ద గ్రానైట్ రాళ్లను భద్రంగా బిగించేందుకు తగిన సేఫ్టీ బెల్టులు, ఇతర రక్షణ ఏర్పాట్లు చేయకుండానే తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

రక్షణ చర్యలు ఏవీ?

గ్రానైట్ రాళ్లు సాధారణ సరుకు మాదిరిగా తేలికైనవి కావు. వాటి బరువు అధికంగా ఉండటంతో లారీల్లో లోడ్ చేసే సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రాళ్ల కదలకుండా, వాహనం కుదుపులకు గురైనప్పుడు పక్కకు ఒరిగిపోకుండా పటిష్ఠంగా బిగించాలి. ఇందుకోసం నాణ్యమైన బెల్టులు, అవసరమైన బిగింపు పరికరాలు, ఇతర భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలి. అయితే కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా మల్యాల వైపు వెళ్లే మార్గంలో కొన్ని గ్రానైట్ లారీల్లో ఇలాంటి రక్షణ చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. భారీ రాళ్లను లారీల్లో నింపుకొని రహదారిపై వేగంగా దూసుకెళ్తుండటంతో వాటి వెనుక, పక్కన ప్రయాణించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాయి కొద్దిగా పక్కకు కదిలినా, అదుపు తప్పి కిందపడినా జరిగే నష్టం ఊహించలేనిదని వారు పేర్కొంటున్నారు.

స్పీడ్ బ్రేకర్ల వద్దా అదే వేగం!

కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఇప్పటికే వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారీ గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీలు మరింత జాగ్రత్తగా ప్రయాణించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జగిత్యాల నుంచి మల్యాల వరకు పలు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పటికీ కొన్ని లారీలు వేగాన్ని తగ్గించకుండా దూసుకెళ్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్ల వద్ద లారీలు ఒక్కసారిగా కుదుపులకు గురైతే వాటిపై ఉన్న భారీ రాళ్లు కదిలే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు, లారీలను అధిగమించేందుకు ప్రయత్నించే ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు ముందున్న లారీ నుంచి ఏదైనా రాయి జారిపడుతుందేమోనని వెనుక వచ్చే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు, చిన్న కార్లలో ప్రయాణించేవారు భారీ వాహనాలకు కొంత దూరం పాటిస్తూ ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రహదారి ఇరుకుగా ఉండటం, ఎదురెదురుగా వాహనాలు రావడం వంటి పరిస్థితులు ప్రమాద తీవ్రతను మరింత పెంచే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

రహదారిపైనే నిలిపివేత.. మరింత ముప్పు!

గ్రానైట్ రాళ్లను తరలించే కొన్ని లారీలు రహదారిపై నిలిచిపోవడం, లోడ్ చేసిన రాళ్లు ఒకవైపునకు వంగినట్లు కనిపించడం వంటి ఘటనలు గతంలోనూ చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వెనుక నుంచి వచ్చే వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రహదారిపై లారీలు నిలిచిపోయినప్పుడు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకపోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించవచ్చని అంటున్నారు. భారీ గ్రానైట్ రాళ్లను తరలించే సమయంలో లోడ్ సామర్థ్యాన్ని పాటించడంతోపాటు రాళ్లు కదలకుండా బిగించారా? వాహనంలో నిర్దేశిత భద్రతా పరికరాలు ఉన్నాయా? వాహనానికి అనుమతించిన బరువుకు మించి సరుకు తరలిస్తున్నారా? అనే అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకుంటేనే రహదారులపై భద్రత పెరుగుతుందని పేర్కొంటున్నారు.

అధికారుల నిఘా ఏమైంది?

భారీ గ్రానైట్ రాళ్ల రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రవాణా శాఖ అధికారులు, పోలీసులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి వాహనాల భద్రత, లోడ్ పరిమితి, వేగ నియంత్రణపై దృష్టి సారించాలని కోరుతున్నారు. రహదారిపై వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయాణించే లారీలను గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై ప్రమాదాలను నివారించడం ముఖ్యమని వారు అంటున్నారు. గ్రానైట్ రాళ్ల రవాణా చేసే వాహనాలకు సంబంధించి తరచూ తనిఖీలు చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతున్నారు. అవసరమైన చోట వేగ నియంత్రణపై నిఘా పెంచడంతోపాటు రహదారిపై లారీలు నిలిచిపోయినప్పుడు హెచ్చరిక ఏర్పాట్లు తప్పనిసరి చేయాలని సూచిస్తున్నారు.

ప్రమాదం జరిగేదాకా వేచి చూడొద్దు!

భారీ గ్రానైట్ రాళ్లను తరలించడం వ్యాపారపరంగా అవసరమే అయినా, ఆ క్రమంలో ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టకూడదని వాహనదారులు స్పష్టం చేస్తున్నారు. లారీ యజమానులు, డ్రైవర్లు రవాణా నిబంధనలను పాటిస్తూ రాళ్లను పటిష్ఠంగా బిగించి, పరిమిత వేగంతో ప్రయాణించాల్సిన బాధ్యత ఉందని పేర్కొంటున్నారు. అధికారులు కూడా తనిఖీలను ముమ్మరం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



చొప్పదండి వార్త



యంగ్ స్టార్ యూత్

ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ..

మల్యాల, ప్రభాతవార్త : రామడుగు మండల కేంద్రంలో దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుపురం పరుశరాం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ లు,భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం పరుశరాం గౌడ్‌ను యూత్ సభ్యులు ఘనంగా సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వెంకట సాయి, కార్తీక్, పవన్, వెంకటేశ్, రంజిత్, సిరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కరెంటు,

నీటి పొదుపు చర్యలు చేపట్టాలి

సింగిల్ విండో చైర్మన్ సతీష్ రెడ్డి



మల్యాల, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావంతో రాబోయే కరువును ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు కరెంటు తో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని నూకపల్లి సింగిల్ విండో చైర్మన్ నేరెళ్ల సతీష్ రెడ్డి కోరారు, ఇండ్లలో విద్యుత్ అవసరం మేరకే వినియోగించాలని, నీటిని కూడా వృధా కాకుండా పొదుపుగా వాడుకుంటేనే రాబోయే ఎనిమిది నెలలలో కరువు పరిస్థితుల నుండి బయటపడతామన్నారు, అంతేకా కుండా రైతులు యాసంగి లో వరి సాగు చేయకుండా ఉంటేనే మంచిదని, ఆరుతడి పంటలకు వేసుకోవాలని ఆయన సూచించారు, కరువు పరిస్థితుల నివారణకు ప్రభుత్వ సూచనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన కోరారు.



అమ్మవార్లను దర్శించుకున్న

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల పట్టణంలో నిర్వహిస్తున్న అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భక్తులు నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొంటూ భక్తులకు అందుబాటులో ఉంటున్న అడువాల జ్యోతి లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చెట్టి గంగాధర్, సిరికొండ పద్మ సింగారావు, పంబాల సుజాత రాము, భార్గవ్, మున్సిపట్ల లక్ష్మీనారాయణతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



భక్తి,ఐక్యత,సేవాభావంతో పండుగలు జరుపుకోవాలి : డా.బోగ శ్రావణి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా.బోగ శ్రావణి పట్టణంలోని పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ దుర్గా గాయత్రీ దేవాలయం,శ్రీ భక్త మార్కండేయ దేవాలయాలతో పాటు శ్రీ దుర్గా సేవా సమితి,శ్రీ హిందూ కాళికామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆమె పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జగిత్యాల పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,పట్టణం అన్ని రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డా.బోగ శ్రావణి మాట్లాడుతూ,సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడమే కాకుండా యువతలో సేవాభావాన్ని పెంపొందించడం,మహిళలను గౌరవించడం,సామాజిక బాధ్యతతో మెలగడం ద్వారానే బలమైన,ఐక్య సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే,ఉత్సవాలను నిష్టతో పాటు సామాజిక స్పృహతో నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి,బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,45వ వార్డు కౌన్సిలర్ గట్టిపెల్లి మానస-జ్ఞానేశ్వర్,ఆముద రాజు,వీరభత్తిని అనిల్ కుమార్,సింగం పద్మ,ఒడ్నాల రమేష్,పవన్ సింగ్,గాదాసు రాజేందర్,ఇట్యాల రాము, వినీత్ గౌడ్,గుండేటి సాయి,బోగ నరేష్, నారాయణ,ఉమారాణి,సేవా సమితి ప్రతినిధులు,పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కిష్టంపేటలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

చందుర్తి : ప్రభాతవార్త

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో రూపాయలు 20 లక్షలతో నిర్మాణం చేపట్టే గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతులకు పెద్దపీట వేస్తామని. మండలంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. తాను జిల్లా పరిషత్ సభ్యుడుగా. ఎంపీపీగా పని చేసినప్పుడు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు తీసుకురావడానికి కృషి చేసినట్లు గుర్తు చేశారు. ఒవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం వైపు ప్రజా ప్రభుత్వం పయనిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం. ప్రతి ఒక్కరికి గృహాలకు నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు. సన్న బియ్యం అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు. ఎన్నికలప్పుడే



రాజకీయాలని ఇప్పుడు అభివృద్ధి వైపు రావాలన్నారు. మండలంలో రుద్రంగి. జోగాపూర్ చందుర్తి.బండపల్లి. గ్రామాలలో . ప్రాజెక్టులను నిర్మించామని గుర్తు చేశారు. అభివృద్ధి కోసం వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవరాజు. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి సింగిల్ విండో చైర్మన్లు ఎగోలపు శ్రీనివాస్. గసికంటి ప్రభాకర్. ఆత్మ కమిటీ చైర్మన్ ముసుకు ముకుంద రెడ్డి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొట్టే ప్రభాకర్. తాసిల్దార్ భూపతి. ఎంపీడీవో రాధ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు విద్యుత్ షాక్

ఓ పక్కా కోతలు.. మరో పక్కా నీటి కొరత

రుద్రంగి ప్రభాత వార్త

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల సాగునీరు అందక, మరోవైపు విద్యుత్ కోతలు విపరీతంగా పెరిగిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పొలాలకు త్రీఫేజ్ కరెంట్ సరిగ్గా సరఫరా కాకపోవడం వల్ల, బోరు బావుల ద్వారా పంటలకు నీరందించలేక చేతికొచ్చిన వరి, ఇతర పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందని, రోజు ఏడు నుంచి ఎనిమిది గంటల విద్యుత్ సరఫరా కావడంలేదని, ఆ సమయంలోనే లోడ్ ఎక్కువై ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఫీసులు ఆగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట ఈనే దశలో ఉందని, నీళ్లు ఎక్కువగా పారించాల్సిన సమయంలో విద్యుత్ సరఫరా లేక పొలాలకు నీరు అందడం లేదన్నారు. బోర్లు బావుల్లో నీరు



తగ్గిపోవడం, చెరువుల్లో నీరు ఎండిపోవడంతో చివరి దశలో పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. బోర్లల్లో నీరు లేక ఎండుతున్న పొలాలను చూస్తూరైతులు కన్నీరు పెడుతున్నారు. పెట్టుబడి అయినా వస్తుందో రాదో అని రంది పడుతుండగా.. సమయానికి నీరు అందకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. దీంతో అప్పులు చేసి అయినా పంటను కాపాడుకునేందుకు రైతులు కష్టపడుతున్నారు.

సినిమాలతో పల్లెలకు గుర్తింపు

ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

ప్రభాత వార్త కోనరావుపేట

గ్రామీణ ప్రాంతాల్లో తీస్తున్న సినిమాలతో పల్లెలకు గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలో రుద్ర ఎటర్నల్ ఫిలిం ఆధ్వర్యంలో నూతనంగానిర్మితీకరిస్తున్న జిల్లేడుచెట్టు సినిమా షూటింగ్ను పూజలు నిర్వహించి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెటూరు వాతావరణంలో తీస్తున్న సినిమాలు ప్రజాధరణ పొందడంతో పాటుఆ గ్రామాలకు కూడా గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌నాగుల సత్యనారాయణ, కిసాన్సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహనెడ్డి, సింగిలి ్వడో, ఏఎంసీ చైర్మన్లుచేపూరి గంగాధర్, భాస్కర్రావు, ఎల్లయ్య, సర్పంచ్



స్వామిదాస్, సినిమా నిర్మాతలు వినోద్ నాగులు, పొమ్మురళి(బిట్టు), దర్శకుడు శ్రావణ్ కుమార్ ఏపూరి, సిన్మాటోగ్రాఫర్ సూర్య బాలాజీ, ఆర్ట్ డైరెక్టర్ వంశీ,నటీనటులు దీక్షి త్ శెట్టి (దసరా ఫేం), రవికృష్ణ, యోగ లక్షి ్మ, రాధ్య, పుష్ప జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య

చందుర్తి: ప్రభాతవార్త

కరెంటు కోతలు. సాగునీటి ఇబ్బందులతో రైతులను కాంగ్రెస్ పార్టీ ఇబ్బందులకు గురి చేస్తుందని చందుర్తి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మ్యకల ఎల్లయ్య అన్నారు.చందుర్తి లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలకు సరైన విద్యుత్ సరఫరా లేక లో వోల్టేజి సమస్యలతో కరెంటుతో మోటార్లు కాలిపోతూ, ట్రాన్స్ ఫార్మర్లు పేలిపోతూ అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఏటా రెండు పంటలకు రైతుబంధు అందించడమే కాకుండా, రైతు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమాను అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూడు పంటలకు రైతుబంధు కింద ఎకరాకు రూ. 15,000 ఇస్తామని గొప్పలు చెప్పి, ఇప్పుడు రైతుబంధుతో పాటు రైతుబీమాను సైతం అటకెక్కించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో చెరువులు, బావులు, భూగర్భ జలాలు అడుగంటిపోతున్న వేళ, కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి, 750 టీఎంసీల నీటిని సముద్రం పాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా పట్టిసీమ ద్వారా



ఏపీకి నీటిని తరలించుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బొగ్గు కొరత, ఎల్‌నినో అంటూ సాకులు చెబుతూ కాంగ్రెస్ నాయకులు రైతులను ఏసంగి పంటలు వేసుకోవద్దని మాట్లాడడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. పంటలు వేయవద్దని చెప్పిన ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి వేసవి పంటలకు సాగునీరు, నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని, విద్యుత్ కోతలతో ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ తిప్పని శ్రీనివాస్ నాయకులు దుమ్ము అంజయ్య. మరాటి మల్లిక్. బాపూరావు. భైరగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ వార్త



సరస్వతీ దేవి అలంకారంలో దుర్గామాత

చందుర్తి: ప్రభాతవార్త

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో పల్లె మీద యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారు ఆరవ రోజు శుక్రవారం సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. యువ చైతన్య యూత్ క్లబ్ సభ్యులు మ్యాకల రాజు, పందిరి శ్రీనివాస్. తాళ్ల పెళ్లి కాశీనాథం. అటుకుల మధుసుధన్.ఆడ గట్ల గంగాధర్. గడ్డం అనిల్, వడ్నాల శ్రీనివాస్. శశాంక్. మానుకనాగరాజు. చిగుర్ల గిరీష్ భవాని దీక్ష చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందుర్తి మండలంలో పలు గ్రామాల్లో దుర్గ మాత వద్ద భక్తుల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తడగొండ దుర్గామాత మండపం వద్ద హంస వాహన రూపంలో ఘనంగా దీపాలంకరణ



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలోని దుర్గామాత ఆలయం వద్ద గురువారం రాత్రి దీపాలంకరణ ఘనంగా నిర్వహించారు.అమ్మవారి ముందు హంస వాహన రూపంలో నీటి పెట్టెను ఏర్పాటు చేసి, దాని చుట్టూ, మధ్యలో హంస బొమ్మను ఉంచి దీపాలతో ఎంతో అందంగా అలంకరించారు. ఈ దీపాలంకరణ కార్యక్రమంలో శ్రీ దుర్గా గణేష్ కమిటీ ఉత్సవ సభ్యులు, మహిళలు, భవాని స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం దీపకాంతులతో కళకళలాడింది.

దుర్గామాత మండపాన్ని సందర్శించిన సబ్ ఇన్స్పెక్టర్



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండల కేంద్రం లోని దుర్గామాత మండపం ను బోయిన్ పల్లి ఎస్ ఐ రమాకాంత్ పోలీసు సిబ్బంది తో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్,ఉప సర్పంచ్,పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

దేశాయి పల్లి లో చోరీ

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలం లోని దేశాయి పల్లి గ్రామంలో కళ్యాణం వెంకటేష్ గృహం లో దొంగలు చోరీ చేశారు.చోరీ విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సభ్యులతో చేరుకుని పరిశీలించారు.మొత్తం ఇంట్లో 240 గ్రాముల వెండి వస్తువులు,8 గ్రాములు బంగారం పోయినట్లు బాధితుడు తెలిపారు.

సోలార్ ప్లాంట్ ఆదాయంలో గ్రామ అభివృద్ధి కోసం కేటాయించాలని వినతి

ప్లాంట్ ఆదాయం లో 5శాతం వాటాకు కలెక్టర్ అంగీకారం

మంథని రూరల్ ప్రభాతవార్త

:సోలార్ ప్లాంట్ నుంచి వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని గ్రామ అభివృద్ధి కోసం కేటాయించాలని మంథని మండలం దుబ్బపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్ రావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా దుబ్బపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో సోలార్ ప్లాంట్ నుంచి వచ్చే ఆదాయంలో పది శాతం గ్రామ అభివృద్ధి కోసం కేటాయించాలని కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ 5శాతం వాటా ఇవ్వటానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ కృష్ణవేణి నరేష్ రావు తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్, చిన్నపిల్లల



పార్క్, ఓపెన్ జిమ్, కల్వర్టులు, సిసి రోడ్లు, పంచాయతీ భవనానికి కాంపౌండ్ వాల్, మహిళ భవనం, మహిళల ఉపాధి కోసం స్మాల్ కేర్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీజా రెడ్డి, దుబ్బపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సంబంధిత అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంథని శ్రీమహాలక్ష్మి ఆలయంలో మహా అన్నప్రసాదాల వితరణ

మంథని రూరల్ ప్రభాతవార్త:

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంథనిలోని శ్రీ మహాలక్ష్మి మ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాదల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంథనికి చెందిన ప్రముఖ న్యాయవాది లోకే కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.ప్రతి ఏటా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లోకే రాధా కిషన్ రావు, సుధాకర్ రావు, శరత్ రావు, మనోహర్ రావు, కుటుంబ సభ్యులు ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా వివిధ రకాల రుచికరమైన వంటకాలతో అన్నప్రసాదాన్ని అందించి భక్తులను సంతృప్తిపరిచారు.అంతకుముందు ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ మహాలక్ష్మి మ్మ అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, అన్నదాన కార్యక్రమం, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది.

రైతులకు భరోసా ఇవ్వకుండా వరి సాగు వద్దనడం సిగ్గుచేటు

బీ ఆర్ ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి

యాసంగి పంట వేయొద్దంటే జీవనోపాధికి భరోసా ప్రకటించాలి

ముత్తారం, ప్రభాతవార్త:

యాసంగి సీజన్‌లో వరి పంట వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం, వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ముందుగా ఎలాంటి భరోసా కల్పిస్తుందో ప్రకటించాలని ముత్తారం బీ ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీ ఆర్ ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు వర్షాలు కురవకుండా క్షుద్ర పూజలు చేశారని గతంలో ఆరోపించిన మంత్రులు, ఆ తర్వాత దేవుడి దయతో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, పంటలు పండించేందుకు సరిపడా సాగునీరు ఉందని ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎల్ నినో ప్రభావం పేరుతో యాసంగిలో వరి వేయవద్దని చెప్పడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కూలీలు, హమాలీలు, వ్యాపారులు సహా అనేక వర్గాల జీవనోపాధికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందో స్పష్టం చేయాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, బోనస్ డబ్బులు అందించకుండా



రైతులను మోసం చేశారని విమర్శించారు. వర్షాకాలంలో విద్యుత్ కోతల కారణంగా మోటార్లు కాలిపోవడం, పంటలు ఎండిపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు వరి సాగు చేయవద్దని ప్రకటించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వనరులున్నాయని, ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడిన వర్గాలకు భరోసా కల్పించకపోతే బీ ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

దసరా సెలవుల్లో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాల శిక్షణ

దరియాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమాం

మంథనిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థుల శిక్షణ పరిశీల

ముత్తారం, ప్రభాతవార్త:

దసరా సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవడం అభినందనీయమని ముత్తారం మండలంలోని దరియాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మంథనిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న దరియాపూర్ పాఠశాల విద్యార్థులను సందర్శించి, వారు పొందుతున్న శిక్షణను, నేర్చుకుంటున్న నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఆసక్తితో శిక్షణలో పాల్గొంటుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులను



అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక అనుభవం లభించడంతో పాటు వృత్తి నైపుణ్యాలు, స్వయం ఉపాధి సామర్థ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ శిక్షణను పాఠశాల వృత్తి విద్యా శిక్షకులు రత్న గోలి, వెంకట్రాజం ఎజ్జు పర్యవేక్షి స్తున్నారని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి మోడల్ స్కూల్ ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు.

ఆర్ జి త్రీ నూతన లైజన్ ఆఫీసర్ గా కోయడ మనోజ్ కుమార్

రామగిరి ప్రభాతవార్త

రామగుండం ఆర్.జి త్రీ లైజన్ ఆఫీసర్ గా సివిల్ డి వై ఎస్ఈ కోయడ మనోజ్ కుమార్ ను సింగరేణి సంస్థ నియమించింది. ఇట్టి నియామకానికి సహకరించిన సెంట్రల్ ప్రెసిడెంట్, డాక్టర్ రాజేశ్వర్, జనరల్ సెక్రటరీ ఆంటోనీ నాగేశ్వరరావు,ఇతర కార్యవర్గానికి మరియు సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ కు ఇతర అధికారులకు ఆర్ జి త్రీ యాజమాన్యానికి ఎస్సీ ఎస్టీ140/2018. సెంట్రల్ కమిటీ సభ్యులు ఇరుగురాల శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహకం

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని డివిజన్ లోని పలిమెల మండలానికి చెందిన క్రీడాకారిణి కావేరి జ్యోతి నవంబర్ 2026లో జరగనున్న 2వ సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన సందర్భంగా, ఆమెను ప్రోత్సహించేందుకు ఎం ఆర్ గ్రూప్స్ తరఫున డా. ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ కలిసి రూ.10,016 ఆర్థిక ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా డా. కౌటం ఉదయ్ కిరణ్, కృష్ణ కౌశిక్ మాట్లాడుతూ కావేరి జ్యోతి క్రీడారంగంలో మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. ఆమె క్రీడా ప్రయాణంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని అభిలషించారు.

జి.ఎం కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు



రామగిరి ప్రభాతవార్త

బతుకమ్మ సంబురాలను పురస్కరించుకొని శుక్రవారం నాడు రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జి.ఎం.కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఆటపాట కార్యక్రమంలో వివిధ విభాగాల మహిళా అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆర్.జి3 ఏరియా ఇంచార్జ్ సేవా అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ మ్మ నాగేశ్వరరావు బతుకమ్మ ఆటపాటలో పాల్గొని మహిళాఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 06:00 గంటలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టోటుజిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనంఎ ఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, ఏరియా సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్, తో పాటు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల నాటికి కోటిలింగాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

వెల్గటూర్, ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని కోటిలింగాల గ్రామంలో 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షి ంచిన ఆయన, పుష్కరాల నాటికి కోటిలింగాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2027 గోదావరి పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.పుష్కరాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తాగునీరు, పారిశుద్ధం, రవాణా, విశ్రాంతి కేంద్రాలు వంటి ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని



అధికారులకు సూచించారు. అలాగే ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల సమన్వయంతో వేగవంతం చేసి, పుష్కరాలు ప్రారంభమయ్యేలోపు అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.కోటిలింగాల ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసి భక్తులను ఆకర్షించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆలయ ఈవో, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మండల కేంద్రం తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మండల కేంద్రంలోని శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి ఆలయంలో,శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం విజయ దుర్గా సేవా సమితి,భీమ్‌రాజుపల్లిలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం లో దుర్గా సేవా సమితి ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల పర్యవేక్షణలో సరస్వతీ మూలమంత్ర హవనాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులు, విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు.సరస్వతీ దేవి



కటాక్షంతో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు కలగాలని, వారు కోరుకున్న లక్ష్యాలను సాధించాలని భక్తులు అమ్మ వారిని ప్రార్థించారు .అదేవిధంగా రాఘవపట్నంలోని అమ్మ భవానీ సేవా సమితి, వెలుగుమట్లలోని శివ మార్కండేయ స్వామి దేవాలయ శివదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి , అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమాల్లో భవానీ దీక్షాపరులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు.

.మానకొండూర్, ప్రభాతవార్త :

మానకొండూరు మండలంలోని శ్రీనివాస్ నగర్, రాఘవపూర్, సదాశివ పల్లి గ్రామాలలో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటింటా రంగురంగుల పువ్వులతో బతకమ్మను పేర్చేందుకు పోటిపడ్డారు. బతుకమ్మలతో మహిళలు ర్యాలీగా బయలుదేరి గ్రామంలోని దేవాలయం, ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసి బతకమ్మ ఆటపాటలతో, నృత్యాలు కోలాటలతో వేడుకలను మహిళలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే పువ్వులను దేవుళ్ళుగా పూజించే గొప్ప పండగ సద్దుల బతుకమ్మ పండుగ అన్నారు. ఈ పండుగ వేడుకలను మండలంలోని మూడు గ్రామాలలో ఏడవ రోజు సద్దుల బతుకమ్మ ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సద్దుల బతుకమ్మ పండుగతో పల్లెల్లో సందడి



వాతావరణం నెలకొంది. అనంతరం బతుకమ్మలను మానేరు వాగులో చెరువుల్లో ఘనంగా నిమజ్జనం చేపట్టారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా ప్రధాన కూడలి వద్ద గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, రాఘవపూర్ సర్పంచ్ వీణ అనిల్, మాజీ సర్పంచ్ ఎరుకల భాగ్య, శ్రీనివాస్ నగర్ వార్డు సభ్యులు అనవేని రాజు, బొజ్జరాజు, శివరాత్రి అనిల్, కూన అనూష, కూన మమత, గ్రామాల మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి పండుగ వస్త్రాలు

చిగురుమామిడి, ప్రభాత వార్త :

సద్దుల బతుకమ్మ, విజయదశమి దసరా పండుగలను పురస్కరించుకుని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందికి పండుగ కానుకగా నూతన వస్త్రాలను శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గూళ్ళ రజితరాజు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. పండుగల సందర్భంగా సిబ్బందితో ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో వారికి నూతన వస్త్రాలను అందజేసినట్లు వారు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో, పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామపంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ



గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని ఆకాంక్షి ంచారు.!!ఈ కార్యక్రమంలో నవాబుపేట గ్రామ ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు గోట్టే రఘుబాబు, కొడపర్తి శ్రీనివాస్, బోయిని వెంకటమ్మ, గ్రామ కార్యదర్శి సంపత్, బిల్ కలెక్టర్ ఎండి ఫారుక్, గ్రామపంచాయతీ సిబ్బంది ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారికి కలిసిన టిఎస్ జి హెచ్ ఎం ఎ నాయకులు.

మానకొండూర్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా విద్యాధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన విజయ్ సాగర్ ను శుక్రవారం టీఎస్ జిహెచ్ఎంఏ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానం చేపట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎస్ జిహెచ్ఎంఏ డైరీని జిల్లా విద్యాధికారికి అందజేశారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్ కు టీఎస్ జిహెచ్ఎంఏ



నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాపల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు డి. శ్రీనివాస్, వి.శ్రీనివాస్, కే,అశోక్ రెడ్డి, ఎం, లక్ష్మీ నారాయణ, భద్రయ్య, డి, సతీష్, వివి సత్యనారాయణ పాల్గొన్నారు.

ధర్మపురి వార్త



కాత్యాయని రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ధర్మపురి, ప్రభాతవార్త:



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి 6 వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు అమ్మవారికి అభిషేకం, అష్టోత్తర శతనామార్చన, పుష్పార్చన, హారతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం గాయత్రీ యజ్ఞం

ధర్మపురి, ప్రభాతవార్త:



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తీగలధర్మారం గ్రామంలోని శ్రీ దుర్గామాత దేవాలయంలో లోకకల్యాణార్థం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, గాయత్రీ యజ్ఞం నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి సమర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి అశోక్, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, ఆలయ చైర్మన్ జంగిలి రవీందర్ స్థానిక నాయకులు గంధం రమేష్, జంగిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు

ధర్మపురి, ప్రభాతవార్త:

సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలను ప్రోత్సహిస్తూ సంప్రదాయాలను పరిరక్షి ంచే లక్ష్యంతో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందించనున్నట్లు ఎస్ఎస్సీ 1981 బ్యాచ్ కన్వీనర్ జక్కు రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.గత 23 ఏళ్లుగా పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమ మిత్రబృందం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆదివారం గోదావరి తీరంలోని రామాలయం ఎదుట స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రతి బృందం నుంచి సంప్రదాయ పద్ధతిలో పేర్చిన ఉత్తమ బతుకమ్మను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసి బహుమతి అందజేస్తారని తెలిపారు.పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే మహిళలు రాత్రి 11 గంటలలోపు బతుకమ్మల నిమజ్జనానికి వచ్చేలా సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

గొల్లపల్లి, ప్రభాతవార్త:



ఇటీవలజరిగిన అగ్నిప్రమాదంలో ఎండపెల్లి ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి కొమురయ్యకు చెందిన ఇల్లు కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవకుడు ఎడమల బొంజేందర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా నిలిచారు.అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని సందర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎండపెల్లి మాజీ సర్పంచ్ మారం జలేందర్ రెడ్డి, శంకర్రావుపేట ఉపసర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు అవారి చందు తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిపై మొసలి కన్నీళ్లెందుకు కేటీఆర్?

పదేళ్ల పాలనలో ఏం చేశారు? .. సొంతింటి హామీ ఏమైంది?

రామగుండంపై నిర్లక్ష్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్

గోదావరిఖని, ప్రభాత వార్త: అధికారం కోల్పోయాకే సింగరేణి కార్మికులు గుర్తుకొచ్చారా? పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వారి సమస్యలను ఎందుకు పరిష్కరించలేదు? కార్మికుల సొంతింటి కలను ఎందుకు నెరవేర్చలేక పోయారు? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కార్మికుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, సింగరేణి కార్మికులకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో రాజ్ ఠాకూర్ బీఆర్ఎస్ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిం చడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పుడు కార్మికుల సంక్షేమం పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

సొంతింటి కల ఏమైనట్లు?

సింగరేణి కార్మికులకు సొంతింటి సౌకర్యం కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ఎందుకు కార్యరూపంలోకి తీసుకురాలేదని రాజ్ ఠాకూర్ నిలదీశారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు మాట్లాడుతున్న నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని, 34 శాతం లాభాల వాటా, మారుపేర్ల సమస్య పరిష్కారానికి చర్యలు, డిస్మిస్ ఉద్యోగుల పునర్నియామకంపై నిర్ణయాలు, కోటి రూపాయల బీమా సౌకర్యం వంటి అంశాలను వివరించారు.

రామగుండానికి అన్యాయం

సింగరేణి ప్రాంత ప్రజల కష్టార్జితంతో సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలను అభివృద్ధి చేసుకొని, రామగుండాన్ని నిర్లక్ష్యం చేశారని రాజ్ ఠాకూర్ ఆరోపించారు. స్థానిక ప్రాంతాన్ని బొందలగడ్డగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. కేటీఆర్ ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకొచ్చి రామగుండంలో అభివృద్ధిని చూడటం మంచిదేనని వ్యాఖ్యానిస్తూ, గత పాలనలో ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు.కార్మికులే తేల్చాలిసింగరేణి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్మికులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ చూస్తోందని రాజ్ ఠాకూర్ ఆరోపించారు. గతంలో విజిలెన్స్ కేసుల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. కార్మికుల త్యాగాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి, ప్రజాగాయకుడు గద్దర్ త్యాగాలను ప్రస్తావిస్తూ, తెలంగాణ ఉద్యమకారులను గౌరవించడం, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.గత పాలనలో కార్మికులకు ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని పరోక్షంగా బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన రాజ్ ఠాకూర్.. కార్మికుల సంక్షేమంపై కేటీఆర్ ముందుగా తన గత పాలనకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అటవీ భూముల పరిరక్షణపై పోలీసు, అటవీ అధికారులతో సమీక్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో విధులు నిర్వహించే అటవీ సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మంచిర్యాల డీఎఫ్ఓ రాహుల్ జాదవ్, ఏసీపీలతో కలిసి అటవీ అధికారులతో భద్రత, అటవీ భూముల పరిరక్షణ, ప్రజలతో సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, అటవీ చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ అధికారులు, సిబ్బందిపై దాడులు, విధులకు ఆటంకాలు, బెదిరింపులు వంటి ఘటనలను తీవ్రంగా పరిగణించాలని, మహిళా ఉద్యోగులతో సహా విధుల్లో ఉన్న సిబ్బందికి భద్రత కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన దాడులు, విధులకు ఆటంకం కలిగించిన ఘటనలను సమీక్షించి, సంబంధిత కేసుల్లో చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకం, అటవీ సరిహద్దుల నిర్ధారణ, ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన రిజర్వ్ ఫారెస్ట్ భూముల పరిరక్షణకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు. అటవీ సిబ్బందిని అక్రమంగా నిర్బంధించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం



చేయడం, అధికారులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేసి, నిష్పక్షపాతంగా దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణలో పోలీసు, అటవీ శాఖల సమన్వయాన్ని బలోపేతం చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకాలు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అన్ని స్థాయిల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, క్యాంపా నిధులపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వ కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, సర్వేశ్వర్ డీసీఐఎఫ్, జి. రామూర్తి, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ రామమోహన్, జన్నారం ఎఫ్‌డీఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వసతులపై ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమీక్ష

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, హాస్టళ్లలో ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే సమయానికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులను కల్పించేందుకు అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులకు మంజూరైన పుస్తకాలు,యూనిఫామ్ తో పాటు ఇతర అవసరమైన సామాగ్రి విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు.ఈ సమావేశంలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కె.వై. ప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నరేశ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లు,గురుకుల పాఠశాలలు, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిని అరెస్టు చేసి..

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్, కట్కూరి మల్లేష్ డిమాండ్

కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లకు పరామర్శ

పెద్దపల్లి, ప్రభాతవార్త: ఏక్ ధం న్యూస్ జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ, ఎస్ ఐలను వెంటనే అరెస్టు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్, కట్కూరి మల్లేష్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసుల దాడి ఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏక్ ధం న్యూస్ ఎడిటర్ పొత్తూరి శేఖర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో రాతిపల్లి సంపత్‌లను శుక్రవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 2026 అక్టోబర్ 12న రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో శేఖర్ డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఉండగా, ఓ కారులో వచ్చిన ఎస్ ఐ సిహెచ్.శ్రీకాంత్, సివిల్ డ్రెస్‌లో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు బలవంతంగా కారులోకి ఎక్కించుకొని తీసుకెళ్లారని, అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఈ సంఘటనను ముబైల్‌లో వీడియో తీసే ప్రయత్నం చేస్తుండగా అతని ఫోన్‌ను సైతం లాక్కున్నారని, తమ మీదే వార్తలు రాస్తావా అంటూ ఎస్ ఐ శ్రీకాంత్‌తోపాటు కారులో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారని, అనంతరం వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితులు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలి స్టులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ, ఎస్ ఐలను అరెస్టు చేసి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాదాసి స్వామి, వివిధ సంఘాల నాయకులు సంకే రామ్మూర్తి, గసికంటి కుమార్ తదితరులున్నారు.

అంతర్జాతీయ సైకాలజీ సదస్సుకు అట్ల శ్రీనివాస్ రెడ్డి, డా. బి. రజనీ దేవి పరిశోధనా పత్రం ఎంపిక

రాజయోగ ధ్యానంపై తెలంగాణ పరిశోధకుల అధ్యయనానికి అంతర్జాతీయ గుర్తింపు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త; తెలంగాణకు చెందిన అట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. రజనీ దేవి సంయుక్తంగా రూపొందించిన పరిశోధనా పత్రం 2వ అంతర్జాతీయ సైకాలజీ సదస్సు-2026కు ఎంపికైంది. ‘కౌమారదశలో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు భారతీయ సంప్రదాయ ధ్యాన పద్ధతుల అన్వయం” అనే అంశంపై సాగిన ఈ పరిశోధన, రాజయోగ ధ్యానం ద్వారా పాఠశాల విద్యార్థుల భావోద్వేగ శ్రేయస్సును మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తుంది. మాల్దీవ్స్‌లోని విల్లా కాలేజ్ క్యాంపస్‌లో అక్టోబర్ 18న నిర్వహించనున్న ఈ సదస్సులో పరిశోధనా పత్రాన్ని భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:15 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రదర్శించనున్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కోవడంలో రాజయోగ ధ్యానం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యతకు ఎలా తోడ్పడగలదో శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ఈ పరిశోధన ప్రత్యేకత.ఈ సందర్భంగా పరిశోధకులు మాట్లాడుతూ భారతీయ ధ్యాన సంప్రదాయాలను ఆధునిక మనోవిజ్ఞాన పరిశోధనతో అనుసంధానిస్తూ విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు దోహదపడటమే తమ లక్ష్యమని తెలిపారు. పరిశోధనా పత్రం అంతర్జా తీయ సదస్సుకు ఎంపిక కావడం తెలంగాణ విద్యా, పరిశోధ నా రంగాలకు ప్రోత్సా హకరమని పేర్కొన్నారు.



కరెంటు కోతలకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణం

సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం

రుద్రంగి ప్రభాత వార్త

కరెంటు కోతలకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని, ప్రజాప్రాలన అంటే రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేయడమేనాఅని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం రుద్రంగిమండల కేంద్రంలో కరెంటు లేక సాగు నీటి కొరతతో ఎండిన పంట పొలాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రంగిలో ఓ వైపు వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు బాయి, బోర్లలో నీరు ఉన్న నాణ్యమైన కరెంటుఇవ్వకపోవడంతో పొట్టదశలో ఉన్న వరి పంటలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎర్రటి ఎండలో ఇస్తున్న కరెంటుతో మడులు తడువక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు జనరేటర్ సహాయంతో పంటలకు నీరు అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు ఇందిరక్మాలంలో ఎలాగ కరెంటు ఇచ్చారో అలాగే ఇప్పుడు కూడా నాలుగైదు గంటలు కరెంటు ఇచ్చి ప్రజలు ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడ లేనిఎల్సీనో ప్రభావం కేవలం మన రాష్ట్రంలోనే ఉందా అని ప్రశ్నించారు. ఇది కాలం తెచ్చిన కారువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష ్యంతో వచ్చిన కరవన్నారు.కాంగ్రెస్ కు ఓటు వేస్తే నష్టపోతామని కేసీఆర్ అప్పుడే చెప్పారన్నారు. కాలేశ్వరంలో ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా రైతులకు



అవసరమైన సమయంలో సాగు నీరు అందించలేక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఎండకాలంలో కూడా గోదావారి జలాలలో రుద్రంగిలోని నాగారంచెరువు, కలిగోట సూరమ్మ చెరువు, అచ్చయకుంట, బతుకమ్మ కుంటలు మత్తడి దూకడంతో రైతులు సంతోషంగా లాభసాటిగా వ్యవసాయం చేసుకొని లాభాలుగడించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు బీమా, కరెంటు కోతలు, యూరియా కొరతతో రైతులకు కష్టాలు ఎక్కువ అయ్యాయన్నారు. స్థానిఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి రైతుల సంక్షేమానికి కృషి చేస్తూ సాగు నీరు అందించేందుకు ఆలోచనలు చేయాలన్నారు.మండలంలో అధికారులతో సర్వే చేసి పంటలు ఎండిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో రైతులపక్షాన పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచె రాజేశం, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, నాగులపల్లి రవి, అల్లూరిగంగారెడ్డి, బోయిని చంద్రయ్య, లావుడ్య మోహన్, దయ్యాల పెద్దులు, సింగారపు గంగాధర్, సింగారపు గంగారెడ్డి, బాబాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయి

చల్మెడ లక్ష్మీ నరసింహారావు

ప్రభాత వార్త కోనరావుపేట

కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ సర్పంచ్ కుంటెల్లి నాగరాజు తన తాత కుంటెల్లి రాజమల్లయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌నుప్రారంభించారు .ఈసందర్భంగాచల్మెడ లక్ష్మీ నరసింహారావుమాట్లాడుతూయువతలోక్రీడాస్ఫూర్తినిపెంపొందించే ందుకు క్రీడలుఎంతగానోదోహదపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణతో యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఆయన అన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో స్నేహభావాన్ని, ఐకమత్యాన్నిపెంపొందించడంతో పాటు క్రీడాకారులకు త ప్రతిభను నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభనుచాటుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని



ఆకాంక్షించారు.కుంటెల్లి రాజమల్లయ్య జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడంఅభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాల్లో క్రీడల అభివృద్ధికి గ్రామస్థులు, యువత సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచులు స్వామి దాసు, జిన్న అనూషఅనిల్, మల్లేష్, వెంకటేష్, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, చంద్రయ్య గౌడ్, భూమారెడ్డి, మహేష్, పరశురామ్, సింగం ప్రసాద్, సుమన్, శివతేజ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ లో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తీరొక్క రంగుల బతుకమ్మలతో ఆడపడుచులు

కోలాటాలు డీజే లతో మార్మోగిన వేములవాడ

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కలెక్టర్,ఎస్పీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, విమలక్క..ప్రత్యేక ఆకర్షణగా సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్

వేములవాడ ప్రభాతవార్త

వేములవాడ లో ప్రతి ఇల్లు పూల పరిమళం గా మారింది. పట్టణ కూడళ్ళలో మధురంగా వినిపించిన పాటలకు అందరూ జతకలిసి నారీ శక్తి స్ఫూర్తిగా అడుగులు వేశారు. కులాలకు అతీతంగా జరుపుకున్న పండుగ ఆత్మీయతకు అద్దం పట్టాయి. 7 రోజుల పాటు ఎంగిలిపూల బతుకమ్మ నుంచి మొదలైన సంబరాలు సద్దుల బతుకమ్మ తో శుక్రవారం ముగిసాయి.వేములవాడ పట్టణంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. 34 లక్షల రూపాయలతో మున్సిపల్ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వాడవాడలా కోలాటలు ఆటపాటల మధ్య మహిళలు బతుకమ్మ ఆడి పాడారు. యువతులు సెల్ఫీ లకు ఉత్సాహం చూపారు. వేములవాడ లో మిగతా ప్రాంతాలకు భిన్నంగా ఏడో రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తంగేడు, గునుగు పూలు, బంతిపూలు పట్టుకుచ్చులతో పాటు వివిధ రకాల ప్రకృతి పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడపడుచులు ఆధ్యాత్మికతను చాటారు. బతుకమ్మ లో గౌరమ్మను ఉంచి పాటలు పాడి ఆటలు ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటలో మహిళలు తమ కష్టసుఖాలు ప్రేమ స్నేహం బంధం ఆప్యాయతలు భక్తి భయం చరిత్ర పురాణాలు మేళవించాయి.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బిజెపి మాజీ జిల్లా



అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, విమలక్క తదితరులు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.ప్రముఖుల హాజరుతో మరింత సందడిసద్దుల బతుకమ్మ వేడుకలకు తెలంగాణ ఉద్యమ గాయని విమలక్క, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. అలాగే సినీ నటులు సాయికుమార్, రాంజగన్ పాల్గొనడంతో మహిళలు, యువతలో మరింత ఉత్సాహం నెలకొంది. సినీ నటులను చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపారు.బతుకమ్మ తెప్ప వద్ద మిరుమిట్లు గొలిపిన విద్యుత్ కాంతులు.సద్దుల బతుకమ్మ వేడుకలు కోసం మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు మిరుమిట్లు గొలిపాయి. బతుకమ్మ ఆడే ప్రాంతంలో హైమాస్ లైట్లతో లైటింగ్, సీరియల్ బల్బులు ఏర్పాటు చేశారు. బతుకమ్మ తెప్ప వద్దకు రావడానికి మున్సిపల్ ఆధ్వర్యంలో ద్వారం సుందరంగా తీర్చిదిద్ది ఆడపడుచులను ఆహ్వానించారు. ప్రత్యేక పేజీ పై రాజకీయ నాయకులు పుర ప్రముఖులు బతుకమ్మ నిమజ్జనం చేయడానికి వచ్చిన మహిళలకు స్వాగతం పలికారు.ప్రత్యేక పోలీసు బందోబస్తు...వేములవాడ లో సద్దుల బతుకమ్మ వేడుకలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆడుకునే ప్రాంతానికి వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. పట్టణంలోని అన్ని కూడళ్ళలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గస్తీ తిరిగారు.



భీమేశ్వరుడి సన్నిధిలో సినీ నటుల ప్రత్యేక పూజలు.

.వేములవాడ ప్రభాత వార్త:

ప్రముఖ పుణ్యక్షేతం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారిని దర్శించుకున్న నటులు భీమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేయగా ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ సినీ నటులను సత్కరించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సినీ నటుల రాకతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన



ఇబ్రహీంపట్నం ప్రభాతవార్త

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని దుర్గా దేవి సేవా సమితి ఆధ్వర్యంలో ఈరోజు కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకముందు అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించిన సమితి సభ్యులు అనంతరం 51 మంది మహిళలచే కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కస్తూరి భూమేశ్వర్ అధ్యక్షులు గూడ రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు అలిశెట్టి రాజిరెడ్డి, రాము, రవీందర్ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రత్యేక పూజలు



మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:

జిల్లా వంజరి సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మెట్ పల్లి పట్టణానికి చెందిన బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంజరి సంఘం నాయకులు శంకర్ కు కండువా వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంజరి సంఘం నాయకులు ఆంజనేయులు,రాము,బుచ్చలు, శ్రీనివాస్ నారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వరద వెళ్లి లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండలం లోని వరద వెళ్లి గ్రామం లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం లో వేడుకలు ఘనంగా జరిగాయి.ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేసిన సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరుణ్,వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్,పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనంతారంలో వినూత్నంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మల రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ అనంతారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బత్తిని రవీణ మహేష్ వినూత్న ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక బతుకమ్మలను రూపొందించారు.ఇందిరమ్మ ఇల్లు,గృహజ్యోతి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల పేర్లతో బతుకమ్మలను తయారుచేసి ప్రదర్శించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే వేదికగా మలచడం విశేషం. సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్తులు,పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో మేక మృతి..

ఆదుకోవాలని రైతు వేడుకోలు..



బీర్ పూర్ ప్రభాత వార్త. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగుర్ గ్రామంలో అనుకోని ప్రమాదవశాత్తు ఓ పేద రైతుకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన చిన్న సన్నకారు రైతు చిక్కుల్ల శ్రీనివాస తన జీవనోపాధి కోసం మేకలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే రోజూ లాగే మేకలు పొలంలో మేత కోసం వెళ్లగా, అక్కడే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ దగ్గర ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఒక మేక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గురించి స్థానికంగా ఉండే జూనియర్ లైన్మెన్ తెలిపిన వివరాల ప్రకారం అది జరిగిందని నిర్ధారిస్తూ వెంటనే స్పందించి వివరాలు సేకరించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ రాకేష్, లైన్‌మెన్ సతీష్‌లతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి మేక మృతిని నిర్ధారించారు.జీవనాధారమైన మేక మృతి చెందడంతో తాను ఆర్థికంగా నష్టపోయానని, తనకు ప్రభుత్వమే ఆదుకుని తగిన నష్టపరిహారం అందజేయాలని బాధితుడు శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. స్థానిక గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు కూడా సంఘటన స్థలాన్ని సందర్శించి, పేద రైతైన శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దుర్గాదేవిని దర్శించుకున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ నర్సింగపూర్, హబ్సిపూర్ గ్రామాలలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు,గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

ఉత్సాహంగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: బతుకమ్మ సంబరాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఎంతో ప్రత్యేకమైన పండగ బతుకమ్మ పండుగ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన పేర్లతో బతుకమ్మ పండగ మహిళలు నిర్వహిస్తారని, ఈరోజు ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ (బియ్యం పిండితో వేప పండ్ల ఆకారాలు) కాగా ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునగ, బంతి మరియు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట,పాటలతో పండుగ చేసుకోవడం నిజంగా కన్నులపండుగలా ఉందని ఈ వేడుకల్లో



పాల్గొనడం అనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. సంబంధిత శాఖ మహిళా అధికారులు,సిబ్బంది ఉత్సాహకంగా బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు.మహిళలు బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరన్, జిల్లా వైద్య అధికారి సుజాత, సంబంధిత మహిళా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

రేకులపల్లి లో పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు..



బీర్ పూర్ ప్రభాత వార్త. ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా బీర్పూర్ మండలంలోని రేకులపల్లి గ్రామంలో వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి ఎన్. తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలో బ్యాక్టీరియా ఎండు తెగులు, పాముపొడ తెగులు, అగ్గితెగులు, ఆకుముడత పురుగు, మొగిపురుగుతో పాటు కొద్దిపాటి దోమను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ తెగుళ్లు, పురుగుల ఉధృతి వల్ల వరి దిగుబడులు తగ్గే అవకాశం ఉందని, ముఖ్యంగా అగ్గితెగులు, మొగిపురుగు కారణంగా మెడ విరుపు, ఊస పోయి నష్టం కలుగుతుందని హెచ్చరించారు. రైతులు పాటించవలసిన నివారణ చర్యలు: పొలాల మీద గడ్డి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. యూరియా, నత్రజని ఎరువులను మోతాదుకు మించి వాడకూడదు. నివారణలో భాగంగా వేపనూనెను పిచికారి చేసుకోవాలి. తెగుళ్లు మరియు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే, వ్యవసాయ అధికారుల సలహా మేరకు తగిన మందులను వారం పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వినోద్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకోవద్దు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్ట

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: మైనర్లను పనిలో పెట్టుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్ట పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని టి.ఆర్. నగర్‌లో ఉన్న బీబీఐ ఇటుక బట్టీని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్ట శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇటుక బట్టీలో పనిచేస్తున్న కార్మికుల నివాస,మౌలిక వసతులు, పని పరిస్థితులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం కార్మికుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి,వేతనాలు సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అనే వివరాలను ఆడిగి తెలుసుకున్నారు.కార్మికులకు అందిస్తున్న ఆహార నాణ్యత,తాగునీరు,పారిశుద్ధ్య వసతులతో పాటు అనారోగ్యం పాలైనప్పుడు వైద్య సహాయం అందుబాటులో ఉందో లేదో ఆరా తీశారు. ప్రధానంగా ఇటుక బట్టీ ప్రాంగణంలో బాల కార్మికులు ఎవరైనా పనిచేస్తున్నారా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలల హక్కుల పరిరక్షణపై యజమానులకు స్పష్టమైన సూచనలు చేశారు. చిన్న పిల్లలతో పనులు చేయించకుండా వారికి ఉచిత విద్య,సంరక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కార్మికుల హక్కుల పరిరక్షణ,చట్టపరమైన ప్రయోజనాలు అందజేయడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ నిధులతో రంగాపేట్ ఒద్దెర కాలనీకి ఐమాస్ట్ లైట్లు మంజూరు

సారంగాపూర్ ప్రభాత వార్త : మండలంలోని రంగాపేట్ ఒద్దెర కాలనీకి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ ఎంపీ నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. కాలనీలో రాత్రి వేళల్లో వెలుగుల సదుపాయాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ లైట్లు ఉపయోగపడనున్నాయి.ఈ మేరకు శుక్రవారం ఐమాస్ట్ లైట్ల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి, ఒడ్డెర కాలనీ బూత్ అధ్యక్షుడు దండుగుల వంశీకి అందజేశారు.ఈ సందర్భంగా దండుగుల వంశీ మాట్లాడుతూ, తమ కాలనీకి ఎంపీ నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఐమాస్ట్ లైట్ల ఏర్పాటుతో రాత్రి వేళల్లో వెలుతురు మెరుగుపడి, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుంటూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో చిరంజీవి, మల్లేష్, కళ్యాణ్, అంజి, మనోజ్, సిద్ధు, హరికృష్ణ, హరీష్, నవీన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పూడూరులో వరి పొలాల పరిశీలన

కొడిమ్యాల, ప్రభాతవార్త :

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో కంకి నల్లి, సుడి దోమ తెగుళ్ల ఉధృతిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఏఈఓ రాజేష్ సూచించారు. శుక్రవారం కొడిమ్యాల మండలంలోని పూడూరు గ్రామంలో వరి పంట పొలాలను సందర్శించిన ఆయన, పంట పరిస్థితులను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పొలాల్లోకి వెళ్లి మొక్కలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా సుడి దోమ ఉధృతిని ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. సుడి దోమ సాధారణంగా మొక్కల మొదళ్ల భాగంలో ఉండే అవకాశం ఉన్నందున, నివారణ మందులను పిచికారీ చేసే సమయంలో మొక్క మొదళ్ల భాగం పూర్తిగా తడిచేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెగుళ్ల లక్షణాలను గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారుల సలహా మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని, పంట నష్టాన్ని నివారించేందుకు రైతులు నిరంతరం పొలాలను పర్యవేక్షించాలని కోరారు. తెగుళ్ల తీవ్రతను బట్టి సరైన మందులను, సూచించిన మోతాదులోనే వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, రైతు రాజమల్లు పాల్గొన్నారు.



బయో మెడికల్ వ్యర్థాలను ఆరుబయట వేస్తే కఠిన చర్యలు

ఆసుపత్రులు, మెడికల్ షాపుల యజమానులకు కమిషనర్ కిషన్ హెచ్చరి

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త

హుజురాబాద్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులు, ల్యాబ్‌ల నుంచి వెలువడే హానికరమైన బయో మెడికల్ వ్యర్థాలను ఆరుబయట వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ బండి కిషన్ హెచ్చరించారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఆసుపత్రులు, మెడికల్ షాపులు, ల్యాబ్‌ల యజమానులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... బయో మెడికల్ వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మున్సిపల్ ట్రాక్టర్లలో, ఆరుబయట వేయకూడదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ఆ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించే ఏజెన్సీలకు మాత్రమే అందించాలని ఆదేశించారు. పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపుల యజమానులు ప్రతి ఆర్థిక సంవత్సరం విధిగా పురపాలక సంఘం నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని



సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి బయో మెడికల్ వ్యర్థాలను ఆరుబయట వేసిన వారిపై పురపాలక పరిపాలనా చట్టం2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. కిరణ్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్ర పాపిరెడ్డి (శ్రీ మాత హాస్పిటల్), కార్యదర్శి సంగెం శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, దాసి కుమారస్వామి, డాక్టర్ శ్రీనివాస్ (దుర్గ హాస్పిటల్) తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరుసగా ఐదు రోజులు సెలవు

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం..

.జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఐదు రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ప్రకటనలో తెలిపారు. రైతులకు,అడ్డి,పత్తి ఖరీదు వ్యాపారస్తులు, గుమస్తాలు, హమాలీ దాడువాయి కార్మిక సోదరులు,ట్రాక్టర్, ట్రాలీ డ్రైవర్లు ఈ విషయాన్ని గమనించి ఈ సెలవు దినాలలో మార్కెట్ యార్డుకు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని తెలిపారు. 17 శనివారము రోజున ˇమార్కెట్ యార్డు కు సెలవు"18న ఆదివారము రోజున ˇ సద్దుల బతుకమ్మ సాధారణ సెలవు"19న సోమవారము రోజున ˇమహర్నవమి పండుగ సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు"20న మంగళవారము రోజున ˇవిజయ దశమి (దసరా పండుగ) సందర్భంగా ప్రభుత్వ సెలవు"21న బుధవారము రోజున ˇవిజయ దశమి పండుగ మరుసటి రోజు సెలవు"కావున ఇట్టి సందర్భములను పురస్కరించుకొని



శనివారము నుండి బుధవారము"వరకు వరుసగా (05) అయిదు రోజుల పాటు మార్కెట్ యార్డు బందు ఉండగలదని తెలిపారు.తిరిగి 22న ˇగురువారము రోజున మార్కెట్ పున: ప్రారంభం అవుతుందని రైతులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకురావాలని తెలిపారు.

నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న ద్విచక్ర వాహనం పట్టివేత

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

వాహనదారులు చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు: రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి హెచ్చరి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌తో ప్రయాణిస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వాహన తనిఖీల సమయంలో ఈ గుట్టు రట్టయింది.కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అనుముల నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎస్సై ఎ. లక్ష్మారెడ్డి తన సిబ్బందితో కలిసి అక్టోబర్ 15న సాయంత్రం 4 గంటల సమయంలో నగునూరు ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న ఒక టీవీఎస్ స్టార్ సిటీ ద్విచక్ర వాహనాన్ని ఆపి పరిశీలించారు.అసలు నిజం బయటపడిందిలా..వాహనానికి ఉన్న తిశి 15 శి 3355 నంబర్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా, అది వేరే వాహనానికి చెందినదిగా తేలింది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచారించగా, ఆ వాహనం అసలు రిజిస్ట్రేషన్ నంబర్ తిశి 15 గిశి 3355 అని తేలింది.నకిలీ నంబర్ ప్లేట్‌తో



తిరుగుతున్న వ్యక్తిని నగునూరు గ్రామానికి చెందిన భూత్కూరి కరుణాకర్ (తండ్రి: వీరయ్య, వయస్సు: 40 సంవత్సరాలు)గా గుర్తించారు. విచారణలో భాగంగా.. ఆ వ్యక్తి సదరు వాహనాన్ని 2011 ఫిబ్రవరి 15న జగిత్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నిర్వహించిన వేలంలో కొనుగోలు చేసినట్లు తేలింది. అయితే, వాహన యాజమాన్య బదిలీని పూర్తి చేయకుండా, తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా.. మరో వాహనానికి చెందిన నంబర్ ప్లేట్‌ను తగిలించి తిరుగుతున్నట్లు పోలీసులు తేల్చారు.అధికారులను తప్పుదోవ పట్టించే యత్నం..వాహనం అసలు గుర్తింపును దాచిపెట్టి, అధికారులను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను ఉపయోగించినట్లు నిర్ధారించి.. ఆ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు సిబ్బంది మహమ్మద్ ఎస్‌కే ఫైజాన్, పీసీ 3830, కె. సాగర్, పీసీ 3909, బి. రమేష్, పీసీ 3845లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు జిల్లా స్థాయి కీలక పదవులు

.ప్రభాత వార్త కోనరావుపేట

కోనరావుపేట మండలానికి చెందిన బీజేపీ నాయకులకు జిల్లా స్థాయిలో కీలక పదవులులభించాయి. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా జింక వెంకటి, కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మోత్కూ మోహన్, బెంద్రపు శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిన్నా అనిల్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులను బీజేపీ శ్రేణులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.తమ నియామకాలకు సహకరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్, రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా కార్యదర్శి సురేందర్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి,



కోనరావుపేట మండల అధ్యక్షుడు మిర్యాల్కర్ బాలాజీ, మాజీ మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రంలకు నూతనంగా నియమితులైన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

గంగుల పోరాటంతో రూరల్ మండలానికి సాగునీరు



కేసీఆర్, గంగుల చిత్రపటాలకు రైతుల పాలాభిషేకం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):

సాగునీటి కోసం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన పోరాటం ఫలించడంతో కరీంనగర్ రూరల్ మండలానికి సాగునీరు చేరింది. దీంతో హర్షం వ్యక్తం చేసిన నగునూరు, ఇరుకుల్ల గ్రామాలకు చెందిన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు డీ86 కెనాల్ వద్దకు చేరుకుని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా రైతులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ.. పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడినా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల కష్టాలను గుర్తించిన గంగుల కమలాకర్ స్వయంగా చొప్పదండికి వెళ్లి రెగ్యులేటర్ గేట్లు ఎత్తించి నీటిని విడుదల చేయించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చొరవతోనే రూరల్ మండలంలోని రైతులకు సాగునీరు అందిందని హర్షం వ్యక్తం చేశారు.రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న గంగుల కమలాకర్ సేవలను మరువలేమని అన్నారు. సాగునీరు అందడంతో పంటలను కాపాడుకునేందుకు అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలిచి సాగునీటి కోసం పోరాడిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాలే ప్రమాద ఘంటికలు !

ముత్తారంమంథని ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు

రోడ్డు విస్తరణతో పెరిగిన ముప్పు..

వాహనదారుల్లో ఆందోళపలుమార్లు వార్తలు వచ్చినా స్పందించని విద్యుత్ శాఖ అధికారులు



ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారంమంథని ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మట్టిపోసి రోడ్డు ఎత్తును పెంచడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారికి మరింత సమీపంగా మారాయి. విద్యుత్ స్తంభాల ఎత్తు కూడా రహదారి స్థాయికి తగ్గినట్లుగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.నిత్యం వేలాది వాహనాల రాకపోకలు...ముత్తారంమంథని ప్రధాన రహదారి మీదుగా ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే ఈ మార్గంలో మానేరు నదిపై మట్టి రహదారి ఏర్పాటు కావడంతో వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.వార్తలు ప్రచురించినా స్పందన కరువు...రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంబాలు ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని పలుమార్లు వార్తా కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను సురక్షిత ప్రాంతాలకు మార్చాల్సి ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే బదులు, ముందుగానే భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.